



www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
15-06-2024

సంపుటి : 01 | సంచిక : 42 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


# మోడీ పైనే రేవంత్ భారం?

## రుణమాఫీలో కేంద్రాన్ని ఉపయోగించుకోనున్న సీఎం

రైతు రుణమాఫీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమ, నిబంధనలు దాదాపు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. కేంద్రప్రభుత్వం రైతులకు కిసాన్ సమ్మాన్ పథకంలో వర్తింపచేస్తున్న మార్గదర్శకాలనే అనుసరించాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చింది. త్వరలో జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయమై నిర్ణయం తీసుకోబోతున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



- రాష్ట్రంలోనూ కిసాన్ సమ్మాన్ పథకం రూల్స్ వర్తింపు
- రాష్ట్ర ప్రభుత్వానికి సగానికి సంగం తగ్గనున్న భారం
- పెన్షనర్లు, ట్యాక్సీ పేయర్స్, ప్రజాప్రతినిధులకు కట్
- 70 లక్షల నుంచి 33 లక్షలకు లబ్ధిదారుల సంఖ్య
- ఇప్పటికే మార్గదర్శకాలు రెడీ చేసిన అధికారులు..?
- కేబినెట్ భేటీ తర్వాత ఫైనల్ చేసే యోచనలో సీఎం?

**విశ్వంభర, హైదరాబాద్:**

అయితే కిసాన్ సమ్మాన్ పథకం అమలుకు కేంద్రం అనుసరిస్తున్న మార్గదర్శకాలపై రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు స్టడీచేసి రేవంత్‌కు నోట్ పెట్టినట్లు సమాచారం. కేంద్రం అనుసరిస్తున్న మార్గదర్శాలను అనుసరిస్తే రైతు రుణమాఫీ అమలుకు రాష్ట్రప్రభుత్వంపై చాలావరకు భారం తగ్గిపోతుందన్న విషయంలో మిగతా2లో...

# కేసీఆర్, హరీష్ రావుకు నోటీసులు?

## దూకుడు పెంచిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్



- వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ
- నిర్మాణ కంపెనీలకూ అల్టిమేటం
- మధ్యంతర నివేదికపై ప్రభుత్వానికి, విజిలెన్స్‌కు లేఖ
- హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లను విచారించిన కమిషన్
- అఫిడవిట్ల పరిశీలన తర్వాత బహిరంగ విచారణ

**విశ్వంభర, హైదరాబాద్ :**

కాళేశ్వరం ప్రాజెక్టుపై బహిరంగ విచారణకు రెడీ అవుతోంది జస్టిస్ చంద్రఘోష్ కమిషన్. ఈ ఎపిసోడ్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌కు నోటీసులు ఇవ్వబోతోందని టాక్. త్వరలో మరోసారి ఆకస్మిక పర్యటనలకు రెడీ అవుతోంది కమిషన్. నిన్న హైడ్రాలజీ, నిపుణుల కమిటీలను మిగతా2లో...



2

## ధరణి పోర్టల్ పునర్వ్యవస్థీకరిస్తున్నాం

సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రక్షాళన

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

# మల్లారెడ్డిపై భూ కబ్జా కేసు

## ఆయన అల్లుడిపై కూడా పేట్‌బషీర్‌బాద్ పీఎస్ లో కేసు

భూమి ఆక్రమించారని సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఫిర్యాదు



**విశ్వంభర, మేడ్చల్:**

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి వరుసగా షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మొన్న భూమి కబ్జా చేశారంటూ అధికారులు ఆయనపై చర్యలకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇక తాజాగా మరో దెబ్బ పడింది. ఇప్పుడు ఆయన మీద తాజాగా పేట్‌బషీర్‌బాద్ పోలీసులు భూకబ్జా కేసు నమోదు చేశారు. మల్లారెడ్డితో పాటు ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి మీద మొత్తం ఏడు సెక్షన్లతో కేసులను నమోదు చేశారు. మిగతా2లో...

## నిరుద్యోగులను అనేక విధాలుగా రెచ్చగొట్టారు

2

## కేటీఆర్‌కు నోటీసులు

జారీ చేసిన తెలంగాణ హైకోర్టు

2



2

## సీఎం రేవంత్ రెడ్డి గారు.. పక్కా రాష్ట్రాన్ని చూసి నేర్చుకోండి

- ఇచ్చిన హామీలు చంద్రబాబు నెరవేరుస్తున్నారు
- ఆరు నెలలైన హామీలపై నో రియాక్షన్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

## బాబు అలా సెట్ చేశాడు..

- మంత్రులకు శాఖలను కేటాయించిన సీఎం చంద్రబాబు
- పవన్‌కు డిప్యూటీ సీఎంతో పాటు పలు కీలక శాఖలు
- లోకేష్‌కు ఐటీ శాఖ
- వంగలపూడి అనితకు హోం

3

## పల్లా శ్రీనివాస్‌కు టీడీపీ పగ్గాలు

- టీడీపీకి కొత్త బాస్‌ను నియమించిన పార్టీ అధినేత
- భారీ మెజార్టీతో అమర్నాథ్‌పై విజయం
- ఉద్యమ నాయకత్వంలో కీలక పాత్ర
- బీసీలకు టీడీపీ పెద్దపీట

10





# ఈ బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉంది

- సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్
- పాఠశాలకు రూపాయి ఖర్చులేకుండా ప్రయాణం
- ఆధార్‌కార్డులు చూపిస్తూ విద్యార్థినుల హర్షం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో విద్యార్థులు వేసవి సెలవులు ముగిసి 202425 విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఈనెల 12వ తేదీ (బుధవారం) నుంచి విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 139 | ₹ 161 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹233 | ₹266 |

# కవితతో కేటీఆర్ ములాఖత్

## చెల్లెలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



- బెయిల్ కోసం చేస్తున్న ప్రయత్నాలపై వివరణ
- రాష్ట్ర రాజకీయ పరిస్థితులను అడిగిన కవిత
- ఈ నెల 21 వరకు ఆమె రిమాండ్‌లోనే..
- ఎమ్మెల్సీకి 9 పుస్తకాలు అదించిన జైలు అధికారులు

2




# నిరుద్యోగులను అనేక విధాలుగా రెచ్చగొట్టారు

## ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదు

### కాంగ్రెస్ నాయకుల తీరుపై హరీష్ రావు ఫైర్

**విశ్వంభర, సిద్దిపేట:** నిరుద్యోగుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ట్విట్టర్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా నిరుద్యోగులను అనేక విధాలుగా రెచ్చగొట్టారని.. అధికారంలోకి రాగానే వారి పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. గ్రూప్ 1మెయిన్స్‌కు 1:100.... గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని అభ్యర్థులు.. నాయకుల కాళ్ళు పట్టుకొని వేడుకునే పరిస్థితి రావడం దురదృష్టకరమని హరీష్‌రావు అసహనం వ్యక్తం చేశారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 ఎల్జిబిలిటీ పరిగణించాలని విజ్ఞప్తి చేశారు . కానీ ఇప్పుడు వారికి అధికారంలోకి రాగానే ఆ విజ్ఞప్తులు ఎందుకు కనిపించడం లేదు అని హరీష్‌రావు ప్రశ్నించారు.

# కేటీఆర్‌కు నోటీసులు

- అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చారని పిటిషన్లు
- నోటీసులు జారీ చేసిన తెలంగాణ హైకోర్టు
- సీఈవో, సిరిసిల్ల ఆర్వోకు కూడా

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అనుహ్య పరిణామం ఎదురైంది. ఆయనకు శుక్రవారం తెలంగాణ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కేటీఆర్ ఎన్నికల అఫిడవిట్లపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల అఫిడవిట్లలో కేటీఆర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆ పిటిషన్లలో పేర్కొన్నారు. వీటిపై విచారణ జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు విచారణ చేపట్టారు. కేటీఆర్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్‌కు నోటీసులు జారీ చేశారు. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ దాఖలు చేసిన నామినేషన్ డాక్యుమెంట్స్‌లో ఆయన కొడుకు కె. హిమాన్షు పేరిట ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పలేదని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. కేటీఆర్ ఎలక్షన్ అఫిడవిట్లో తనపై భార్య, మైనర్ కుమార్తెలే ఆధారపడ్డారని పేర్కొన్నారని, అయితే గత ఏడాది జులైలో మేజర్ అయిన హిమాన్షు తనపై ఆధారపడలేదని కూడా చెప్పారని వివరించారు. హిమాన్షు సిద్ధిపేట మర్కూక్ మండలం వెంకటాపూర్‌లో నాలుగు 4 ఎకరాలు, ఎర్రబల్లిలో 32.15 ఎకరాలు కొనుగోలు చేసినందుకు వరసగా రూ.10.50 లక్షలు, రూ.88 15 లక్షలు చెల్లించారని, కేటీఆర్ అర్థిక అండ లేకుండా ఇటీవలే మేజర్ అయిన కొడుకుకు అంత డబ్బు ఎలా వస్తుందన్నారు.

# మల్లారెడ్డిపై భూ కబ్జా కేసు

**(మొదటి పేజీ తరువాయి)**

పేట్ బషీరాబాద్ లో 32 గుంటల భూమి విషయంలో వీరిపై కేసు నమోదైంది. ఈ భూమి ఆక్రమణకు గురైందని, నిర్మాణాలు కూడా కూల్చివేశారంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీనివాస్ రెడ్డి పేట్ బషీర్ బాద్ పోలీసులను ఆశ్రయించాడు. దాంతో వారు కాస్తా శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు మల్లారెడ్డిపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా సుచిత్రలోని సర్వే నెంబర్ 82 లో గల 32 గుంటల భూమిని మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి కలిసి కబ్జా చేశారంటూ రెవెన్యూ అధికారులు వెల్లడించారు. తమ విచారణలో ఇది నిజమే అని తేలిందని వారు చెబుతున్నారు. మల్లారెడ్డి పేరు మీద 29 గుంటలు మాత్రమే ఉన్నాయని.. దీంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే సర్వే 82 లోని భూమిపై గతంలో 15 మంది మల్లారెడ్డి కుటుంబంపై కేసులు పెట్టిన సంగతి తెలిసిందే. ఆ భూ వివాదం ఇంకా నడుస్తుండగానే ఇప్పుడు మరో కేసు నమోదైంది.

# తెలంగాణ ఐసెట్ 2024 ఫలితాలు విడుదల



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఐసెట్ 2024 ఫలితాలు విడుదల అయ్యాయి. కాకతీయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్టు ఫలితాలను ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం 4 గంటల తర్వాత ఉన్నత విద్యా మండలి, ఐసెట్ కన్వీనర్ ఐసెటల్ ఫలితాలను వెల్లడించారు. ఈ ప్రవేశ పరీక్షకు హాజరైన అభ్యర్థులు (icet.tsche.ac) అధికారిక వెబ్‌సైట్ నుంచి తమ ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల పొందేందుకు జూన్ 5, 6 తేదీల్లో తెలంగాణలో ఐసెట్ 2024 ప్రవేశపరీక్షను నిర్వహించారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను తెలిపేందుకు అధికారిక ఆన్సర్ కీ జూన్ 8న విడుదల అయింది. ఈ అభ్యంతరాల విండో జూన్ 9న క్లోజ్ అయింది. సబ్జెక్ట్ నిపుణులచే ర్యాంకులను సమీక్షించిన తర్వాత అధికారిక ఫలితాలను రిలీజ్ చేశారు. అంతేకాదు.. ఫైనల్ టీఎస్ ఐసెట్ 2024 ఆన్సర్ కీ విడుదల అయింది. టీఎస్ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్ అభ్యర్థులకు వారి పేరు, రోల్ నంబర్, స్కోర్‌లు (సెక్షనల్) పరీక్షలో వారి ర్యాంక్‌తో సహా కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది. ఐసెట్ అభ్యర్థుల తమ ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకుని ర్యాంక్ కార్డును యాక్సెస్ చేయొచ్చు. ఇందుకోసం.. ఐసెట్ అభ్యర్థులు వారి రిజిస్ట్రేషన్ నంబర్, హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేయాల్సి ఉంటుంది.

# మోడీ పైనే రేవంత్ భారం..?

**(మొదటి పేజీ తరువాయి)**

క్లారిటీ వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీల్లో రైతు రుణమాఫీ అత్యంత కీలకమైనదే కాకుండా చాలా ఖరీదైనది కూడా. ఎలాగంటే ఈ పథకం అమలుకు సుమారు రూ.40 వేల కోట్లు అవసరమవుతుందని అప్పట్లో అంచనా. లోటు బడ్జెట్లో, అప్పుల్లో ఉన్న ఖజనాతో రుణమాఫీని అమలుచేయటం సాధ్యంకాదని రేవంత్ కు అర్థమైపోయింది.

**సగం తగ్గనున్న రుణ భారం**

అందుకనే అధికారంలోకి వచ్చిన నూరురోజుల్లోనే అమలు చేస్తామని చెప్పిన సిక్స్ గ్యారెంటీస్ లో రుణమాఫీ అమలుకు ఆగస్టు 15వ తేదీని గడువుగా రేవంత్ పొడిగించుకున్నారు. ఇప్పుడా గడువు కూడా దగ్గరకు వచ్చేస్తోంది. అందుకనే ఉన్నతాధికారులతో రేవంత్ సమీక్షల మీద సమీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే కిసాన్ సమ్మాన్ పథకం మార్గదర్శకాల అమలు విషయం చర్చల్లోకి వచ్చింది. ఈ పథకం అమలును క్షుణ్ణంగా అధ్యయనంచేసిన ఉన్నతాధికారులకు దీన్నే అమలుచేస్తే రుణమాఫీ హామీని అమలుచేయటంలో ప్రభుత్వంపై చాలాభారం తగ్గిపోతుందని వివరించారు. ఈ పథకం ప్రకారం రుణమాఫీ అమలు విషయంలో ప్రభుత్వంపై సుమారు 15 వేల కోట్ల భారం తగ్గిపోతుందని తేలింది. అంటే రుణమాఫీ అమలుకు ప్రభుత్వానికి అవసరమైన మొత్తం సుమారు రూ.25 వేల కోట్లని తెక్కతేలింది.



**ప్రజాప్రతినిధులకు రుణమాఫీ కట్**

ఇంతకీ ఇంతపెద్దమొత్తంలో భారం ఎలా తగ్గింది ? ఎలాగంటే కిసాన్ సమ్మాన్ మార్గదర్శకాలను యథాతధంగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దాని ప్రకారం తెలంగాణాలో 3 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. అలాగే మరో 1.5 లక్షల మంది పెన్షనర్లున్నారు. మరో లక్షన్నరమంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులున్నారు. అంటే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులే సుమారు 6 లక్షలదాకా ఉంటారు. వీళ్ళు కాకుండా ఎంఎల్ఏలు 119 మంది ఎంపీలు 17, రాజ్యసభ ఎంపీలు ఏడుగురు, 40 మంది ఎంఎల్సీలు, 33 మంది జిల్లా పరిషత్ ఛైర్మన్లు, 13 మంది మున్సిపల్ మేయర్లు, వీరు కాకుండా మాజీ ఎంఎల్ఏలు, మాజీ ఎంపీలు, మాజీ ఎంఎల్సీలు ఉండనే ఉన్నారు. వీరు కాకుండా ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు సుమారు 25 లక్షలుంటారు. వీరు కాకుండా వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్నవారు మరో 5 లక్షలుంటారని అంచనా. ఇలాంటి వారినందరినీ కిసాన్ సమ్మాన్ పథకంలో కేంద్రం లబ్దిదారులుగా తీసేసింది. అచ్చంగా వ్యవసాయం మీద ఆధారపడిన రైతులను మాత్రమే కిసాన్ సమ్మాన్ పథకంలో లబ్దిదారులను చేయాలన్నది కేంద్రం ఆలోచన.

**వ్యవసాయం చేసే రైతులకే..**

ఇలాంటి వాళ్ళ ఆదాయపు పన్ను రిటర్నులు పరిశీలిస్తే వీళ్ళ ఆదాయాలు, అప్పుల లెక్కలు బయటకు వస్తాయి. వీళ్ళల్లో ఎంతమందికి వ్యవసాయభూములున్నాయి, ఎంతమంది వ్యవసాయ రుణాలు తీసుకున్నారు ? ఎంతమందికి పథకంలో రుణమాఫీ అర్హత ఉందనే విషయాలను రాష్ట్రంలోని ఉన్నతాధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రాష్ట్రంలో పంటరుణాలు తీసుకున్న వారిసంఖ్య 47 లక్షలు. పంట రుణాలు తీసుకునేటపుడు వీళ్ళు బ్యాంకులకు అందించిన డాక్యుమెంట్లను పరిశీలించి, ఆదార్ కార్డులను, మొబైల్ నెంబర్లు, ప్యాన్ కార్డుల సీడింగ్ చేస్తే చాలా క్లారిటీ వస్తుంది. ఇవన్నీ జరిగితే నిజమైన లబ్దిదారుల సంఖ్య చాలావరకు తగ్గిపోతుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ధరణి పోర్టల్ ప్రకారం పట్టదారుపాస్ పుస్తకాలున్న వారి సంఖ్య 70 లక్షలు. అయితే ఇందులో కిసాన్ సమ్మాన్ పథకంలో లబ్దిపొందుతున్న రైతులు 33 లక్షలమంది మాత్రమే. దీని ఆధారంగా రుణమాఫీకి కిసాన్ సమ్మాన్ పథకం మార్గదర్శకాలను అనుసంధానిస్తే రుణమాఫీ అర్హుల సంఖ్య భారీగా తగ్గటంతో పాటు ప్రభుత్వంపై ఆర్థికభారం కూడా తగ్గుతుందని సమాచారం.

# ధరణి పోర్టల్ పునర్వ్యవస్థీకరించనున్నాం

**విశ్వంభర, హైదరాబాద్ :** ధరణి పోర్టల్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళన షురూ చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ధరణి పోర్టల్‌ను సామాన్యులకు అందుబాటులో ఉండేలా, పునర్వ్యవస్థీకరించనున్నట్లు తెలిపారు. భూమికి సం బంధించిన ముఖ్యమైన చట్టాలన్నీ కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని ధరణిపై ఏర్పా టైన కమిటీ సూచించిందని మంత్రి పేర్కొన్నారు. భూవివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని కూడా సిఫార్సు చేసిందన్నారు. శుక్రవారం సచివాలయంలో ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండ రెడ్డి, ఎం.సునీల్ కుమార్, మధుసూదన్‌లతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమా వేశమయ్యారు. ఎలాంటి అధ్యయనం చేయకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు భూ సమస్యలతో చిన్నాభిన్నం అయ్యాయని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారన్న ఆయన, వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమ స్యలను పూర్తిగా అధ్యయనం చేసేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేశామన్నారు. ఈ కమిటీ ఇచ్చిన సిఫారసులపై సమావేశంలో చర్చించామని, కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి ఇచ్చే ముందే అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



**ధరణి సమస్యలకు త్వరలోనే పరిష్కారం..**
**నవీన్ మిట్టల్ కీలక ఆదేశాలు**

ధరణి సమస్యలపై కలెక్టర్లతో తెలంగాణ భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2.20 లక్షల పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు.ఈ నెలలోనే వీలైనన్ని దరఖాస్తులు పరిష్కరించాలని అన్నారు. పాస్ బుక్ డేటాలోనే అధికంగా దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ధరణిలో 188 టెక్నికల్ సమస్యలను గుర్తించామని అన్నారు. వాటిలో 163 సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు.వారంపది రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. పెండింగ్ దరఖాస్తులు అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయని చెప్పారు. అతి తక్కువ ములుగులో ఉన్నాయని అన్నారు. కాగా, ధరణి సమస్యల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే.

# సీఎం రేవంత్ రెడ్డి గారు.. పక్కా రాష్ట్రాన్ని చూసి నేర్చుకోండి

**విశ్వంభర, హైదరాబాద్:** పక్క రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పడి ఆరు నెలలైనా హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం, సీఎంకి మూడు రోజుల క్రితం బహిరంగ లేఖ రాశానని తెలిపారు. ఏపీలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన కొన్ని గంటల్లోనే ఐదు హామీలపై సంతకం పెట్టారన్నారు. చంద్రబాబు నాయుడు వృద్ధాప్య పెన్షన్లను 2 వేల నుంచి 4 వేలు పెంపు చేస్తూ సంతకం పెట్టారని గుర్తు చేశారు. తెలంగాణలో వృద్ధాప్య పెన్షన్లు 4 వేలు చేస్తా అన్నారని, ప్రభుత్వం ఏర్పడి 6 నెలులు అయినా రేవంత్ రెడ్డి మర్చిపోయారని గుర్తు చేశారు. పక్క రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాలన్నారు. ఏపీ రాష్టం ఆర్థిక సంక్షోభంలో ఉన్న, ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేరుస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు గత పెన్షన్ కలిపి 7 వేలు ఇస్తా అన్నారని తెలిపారు. ఆరు నెలల పెన్షన్ కలిపి మొత్తం వృద్ధులకు 12 వేలు పెన్షన్ ఇవ్వాలి రేవంత్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 1 తరగతి నుంచి 10 తరగతి వరకు పంపిణీ చేసే పుస్తకాలు విద్యార్థులకు ఇచ్చి మళ్ళీ తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాపై మరో భారం పడుతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన కేసీఆర్ బొమ్మ పుస్తకాలపై వచ్చి ఉండవచ్చు, వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ ఇచ్చిన పుస్తకాలు తీసుకోవద్దని అన్నారు. పుస్తకాలపై జాతీయ గీతం ఉందని తెలిసింది దాన్ని తీసేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఏపీ లో గత ముఖ్యమంత్రి బొమ్మ ఉన్న పుస్తకాలు పిల్లలకు ఇచ్చారన్నారు. ఆశ వర్కర్లకు జీతాలు రావడం లేదని, వారి జీతాలు పెంచుతామని రేవంత్ అన్నారని తెలిపారు. అధ్యక్షుడు మార్పుపై బీజేపీ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. బీజేపీ రానున్న రోజుల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతిని చూశారన్నారు. ప్రజలు మా వైపు ఉన్నారని, ఏ స్కాం జరిగిన దానిపైన విచారణ జరుగుతుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెప్పారు.

# కవితతో కేటీఆర్ ములాఖత్

**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ అరెస్ట్ అయి తిహార్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. బెయిల్ కోసం ఎన్ని సార్లు పిటిషన్లు వేసినా.. కోర్టులు తిరస్కరిస్తున్నాయి. అంతే కాకుండా ఆమెకు వరుసగా జ్యుడీషియల్ రిమాండ్ ను పెంచుతూనే ఉన్నాయి కోర్టులు. ఇక ప్రస్తుతం ఆమెకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌ను మరో రెండు వారాల పాటు పొడిగించింది. ఈ క్రమంలోనే తిహార్ జైల్లో ఉన్న కవితను శుక్రవారం బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం చేస్తున్న ప్రయత్నాలతో పాటు రాష్ట్ర రాజకీయ పరిస్థితుల గురించి కవిత అడిగి తెలుసుకున్నారు. ఇక కవిత లిక్కర్ కేసులో ఆమెకు వరుసగా పరాజయం ఎదురవుతోంది. సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది. ఈ మేరకు సీబీఐ కేసులో ఈ నెల 21 వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఇక కవిత ప్రస్తుతం చదువుకోవడానికి 9 పుస్తకాలను ఇచ్చారు.

# ఈ బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉంది

**(మొదటి పేజీ తరువాయి)**

కొలువుదీరిన కొత్త ప్రభుత్వం సరికొత్త విధానాలతో ముందుకొచ్చింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన రోజే అమలు చేసిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థినులు ఇప్పుడు బస్ పాస్‌లకు బదులుగా ఆధార్‌కార్డులను వెంట తీసుకెళ్లి జీరో టికెట్ తీసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి బస్సుల్లో పాఠశాలకు వెళ్లే విద్యార్థినులకు ఎంతో మేలు చేస్తోంది. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఓ ట్వీట్ చేశారు.

**రూపాయ కూడా ఖర్చు లేదు..**

రేవంత్ ట్వీట్‌లో ఈ విధంగా రాసుకొచ్చారు. "సిద్ధిపేట జిల్లా, నంగునూరు మండలం, మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉంది. ఊరికి కిలో మీటర్ దూరాన ఉన్న పాఠశాలకు రూపాయి ఖర్చు లేకుండా వెళ్లగలుగుతున్నారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వల్ల బస్సెక్కి స్కూలుకు వెళ్లగలుగుతున్నామని తమ చేతిలో ఆధార్ కార్డులు చూపిస్తూ వాళ్లంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు" అంటూ సీఎం పేర్కొన్నారు.

# హత్యపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్

**విశ్వంభర, హైదరాబాద్ :** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో పట్టపగలు గువ్వల సంజీవ్ అనే వ్యక్తిని కొట్టి చంపిన ఘటనపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. భౌతిక దాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే శక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే, అక్కడి బాధ్యులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు.

# కేసీఆర్, హరీష్ రావుకు నోటీసులు?

**(మొదటి పేజీ తరువాయి)**

విచారించిన జస్టిస్ ఘోష్.. శుక్రవారం ఇంకొందరిని పిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణ వేగవంతంగా కొనసాగుతోంది. హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లను కమిషన్ విచారించింది.

**రెండు కమిటీల ఇంజినీర్లకు కీలక ఆదేశం**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తాము ఐడెంటీఫై చేసిన అంశాలను వివరించిన రెండు కమిటీలు.. ఎక్కువ నీటిని నిల్వ చేయడం వల్లే సమస్య తలెత్తిందని చెప్పినట్టు తెలుస్తోంది. రెండు వారాల లోపు మధ్యంతర నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలపై అఫిడవిట్ ఫైల్ చేయాలని నిపుణుల కమిటీలకు సూచించింది. అఫిడవిట్ల పరిశీలన తర్వాత బహిరంగ విచారణ చేసేందుకు జస్టిస్ పీసీ ఘోష్ సిద్ధమవుతున్నారు. ఇందులో సంబంధం ఉన్న వారికి నోటీసులు ఇచ్చేందుకు గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్‌కు నోటీసులు ఇచ్చే అవకాశాలున్నట్టు టాక్ వినిపిస్తోంది.

**ఆకస్మిక పర్యటనలకు జస్టిస్ పీసీ ఘోష్ ప్లాన్**

మరోవైపు.. విజిలెన్స్ ఇచ్చిన మధ్యంతర నివేదిక సమర్పించాలని గతంలోనే కమిషన్ ఆదేశించినా.. అది ఇప్పటివరకు చేరలేదు. రిపోర్ట్ వెంటనే సమర్పించాలని మరోసారి ప్రభుత్వానికి, విజిలెన్స్ విభాగానికి లేఖ రాయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ఆకస్మిక పర్యటనలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. టెక్నికల్ అంశాల తర్వాత ఆర్థిక అంశాలపై కమిషన్ దృష్టిసారించనుంది కమిషన్. ఆనకట్ట నిర్మాణ అంచనాలు, రుణాలు, వడ్డీ రేట్లపై విచారణ చేయనుంది. విచారణలో భాగంగా ఇటీవల ఎల్ అండ్ టీ, నవయుగ, ఆఫ్కాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యాయి. ఆరోపణలపై కమిషన్ వివరణ కోరగా.. తమకు టైం బౌండ్ పెట్టారని నిర్మాణం కంపెనీలు చెప్తున్నాయి.. ప్రభుత్వం విధించిన సమయంలో ప్రాజెక్టు పూర్తిచేసి అందించామని అంటున్నాయి. ఇదే విషయం అఫిడవిట్ రూపంలో సమర్పించాలని కమిషన్ సూచించింది. అఫిడవిట్‌లో సమాచారంతో విచారణను తప్పుదోవ పట్టించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులను హెచ్చరించింది కమిషన్. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రిపోర్ట్ ఇచ్చేందుకు జూన్ 30న డెడ్ కావడంతో నిర్మాణ కంపెనీలు, అధికారులు, సంబంధిత వ్యక్తుల నుంచి అన్ని వివరాలు సేకరిస్తోంది కమిషన్.

**'ప్రాణహిత - చేవెళ్ల'ను కాదని కాళేశ్వరం ఎందుకు చేపట్టారు?**

ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకాన్ని కాదని, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును ఎందుకు చేపట్టారన్న విషయమై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆరా తీస్తోంది. గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉండగా, భారీ వ్యయంతో ఎత్తిపోతలు చేపట్టాల్సిన అవసరం, అందుకు గల కారణాలను అన్వేషించే పనిలో పడింది. ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతలతో పాటు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసే విషయమై ఐదుగురు సభ్యులతో కూడిన విశ్రాంత ఇంజినీర్ల కమిటీ ఇచ్చిన నివేదిక, దానిపై అప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆరా తీస్తోంది. ప్రాణహిత చేవెళ్లను కాదని కాళేశ్వరం చేపట్టడానికి గల కారణాలు, ఎవరు నిర్ణయం తీసుకున్నారు? ఎందువల్ల ఆ నిర్ణయం తీసుకున్నారన్న విషయాలను నివేదించాలని నీటి పారుదల శాఖను కమిషన్ ఆదేశించింది. గోదావరిలో నీరు ఉండగా, ప్రాణహిత జలాలను ఎత్తి పోయాల్సిన అవసరం ఏమిటన్న విషయమై కూడా కమిషన్ ఆరా తీస్తోంది. ఇప్పటికే మధ్యంతర నివేదిక ఇచ్చిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని తుది నివేదిక ఇవ్వాల్సిందిగా జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. కాళేశ్వరం ప్లానింగ్‌కు సంబంధించి పూణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ నుంచి కూడా నివేదిక కోరారు. జూలై మొదటి వారంలో నివేదికలు వచ్చే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. విజిలెన్స్ విభాగం నుంచి కూడా తుది నివేదిక కోరారు. మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారణ కొనసాగిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు శుక్రవారం ఈఎన్సీ జనరల్ కార్యాలయం, ఓ అండ్ ఎం విభాగాల ఇంజినీర్లు హాజరయ్యారు. మూడు ఆనకట్టలకు సంబంధించి వారిని విచారణ చేశారు. ఆ వ్యవహారాలకు సంబంధించి వారు నిర్వర్తించిన పాత్ర, సంబంధిత అంశాల గురించి ఆరా తీశారు. దీంతో ఇంజినీర్లకు సంబంధించిన విచారణ దాదాపుగా పూర్తయింది. ఈ నెల 27వ తేదీలోపు అన్ని అఫిడవిట్లు వచ్చాక, 10 రోజుల పాటు పూర్తి స్థాయిలో విశ్లేషించి తదుపరి కార్యాచరణ చేపట్టనున్నారు.



## పార్టీ అధిష్ఠానం ఏ పదవి ఇచ్చినా నాకు ఓకే..

- మునుగోడు ప్రజలు త్వరలోనే శుభవార్త వింటారు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**విశ్వంభర, చౌటుప్పల్:** కాంగ్రెస్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ప్రజలు ఎదురుచూస్తున్న శుభవార్త త్వరలోనే వస్తుందనుకుంటున్నానని చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు ఏ పదవి ఇచ్చినా సంతృప్తిగా చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మున్సిపాలిటీ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని చెప్పారు. స్థలం ఉండి కట్టుకునే వారికి ర.5 లక్షలు ఇస్తామని తెలిపారు.అలాగే, ఇంటి స్థలంలేని నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు తొందర్లోనే ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో లాగా మాట ఇచ్చి తప్పే ప్రభుత్వం తమది కాదని అన్నారు. కాగా, తెలంగాణ మంత్రవర్గ విస్తరణ త్వరలోనే జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. క్యాబినెట్‌లో మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉంది. అంతేగాక, టీపీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారు? కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం ఏంటన్న ఉత్కంఠ నెలకొంది.

## గ్రూప్ 2 అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్2 సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం ఎడిట్ ఆప్షన్ సదుపాయాన్ని తీసుకువచ్చింది. ఈ విషయాన్ని శుక్రవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. ఈ ఎడిట్ ఆప్షన్ సదుపాయం జూన్ 16 ఉదయం 10 గంటల నుండి జూన్ 20 సాయంత్రం 5 గంటల వరకు కమిషన్ వెబ్‌సైట్ https://www.tspsc.gov.inలో అందుబాటులో ఉంటుంది అని పేర్కొంది.అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో చేసిన ప్రతి ఎంట్రీని సరిచూసుకోవాలని, అవసరమైన చోట దిద్దుబాట్లు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పుడు ఇచ్చిన ఎడిట్ ఆప్షన్ ఫైనల్ అని, అప్లికేషన్ ను సవరించడానికి తదుపరి అభ్యర్థనలను స్వీకరించబోమని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. "ఈ డేటా ఫైనల్ సెలక్షన్ కి పరిగణించబడుతుంది కాబట్టి అభ్యర్థులు ఎడిట్ ఆప్షన్‌ని ఉపయోగిస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్త వహించాలి. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణలు చేస్తే, వారు సంబంధిత సర్టిఫికేట్‌లను అప్‌లోడ్ చేయాలి అంటే, SSC, ఆధార్ కార్డ్ మొదలైనవి" అని తెలిపింది. అప్లికేషన్‌ను సవరించిన తర్వాత అన్నీ కరెక్టుగా ఉన్నాయా లేవా అని జాగ్రత్తగా చెక్ చేసుకోవాలని సూచించింది. అలాగే అభ్యర్థులు కరెక్షన్స్ చేసిన అప్లికేషన్ పీడీఎఫ్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని, భవిష్యత్తులో రిఫరెన్స్ కోసం వాటిని భద్రపరుచుకోవాలని తెలిపారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న, రాయడంలో ఇబ్బంది ఉన్న పిడబ్ల్యుడి అభ్యర్థులు ఎడిట్ ఆప్షన్ సదుపాయాన్ని ఉపయోగించి అపెండిక్స్3ని అప్‌లోడ్ చేయాలని కోరారు. జూన్ 20 గడువులోపు చెల్లుబాటు అయ్యే అపెండిక్స్3 ని అప్‌లోడ్ చేసిన అభ్యర్థులు నిబంధనల ప్రకారం స్క్రైబ్ లేదా కంపెన్సేటరీ సమయాన్ని అందించడానికి పరిగణించబడతారు అని టీజీపీఎస్సీ వెల్లడించింది.

## నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తాం

- గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ రంగ విస్తరణకు సర్కార్ ప్లాన్
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**విశ్వంభర, వాషింగ్టన్ డీసీ:** ప్రవాస భారతీయులు తాము పుట్టిన ఊరి మేలుకోసం గ్రామాల పురోగతిలో భాగస్వాములు కావాలని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేసన్ (జీటీఏ) ఆధ్వర్యంలో వాషింగ్టన్ డీసీ ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చెప్పారు. కేరళలో విజయవంతంగా నడుస్తున్న ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు కంటే గొప్పగా త్వరలో తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్రవాస భారతీయులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. త్వరలో పెద్దపల్లి జిల్లాలో రూ.1000 కోట్ల అంచనా వ్యయంతో కోకాకోలా మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో మూత పడిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని ఏడాది లోపు తెరవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. చెరుకు రైతులకు మేలు చేయడంతోపాటు ఆ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తోపాటు రాష్ట్ర నలుమూలల ఫైబర్ నెట్‌వర్క్ అందుబాటులో ఉందని చెప్పారు. హైదరాబాద్ నగరానికి మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు తీసుకు రావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ రంగ విస్తరణకు తమ సర్కార్ సన్నాహాలు చేస్తుందని మంత్రి దుద్దిళ్ల తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌ను ఏఐ రాజధానిగా మార్చడానికి తమ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ చైర్మన్ విశ్వేశ్వర్‌తోపాటు 6టీవీ చైర్మన్ సురేశ్ రెడ్డి, జీటీఏ కోశాధికారి సుధీర్ ముద్దసాని, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమరేంద్ర నంది, వాషింగ్టన్ డీసీ ఉపాధ్యక్షులు కోట్య బానోత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇటలీలో మోడీ బిజీ బిజీ!

## జీ7 సదస్సుకు ప్రధాని హాజరు

- ప్రపంచ దేశాధినేతలతో వరుస భేటీలు
- టెక్నాలజీ, వాణిజ్యం రంగాల్లో సంబంధాలకు అవకాశాలు
- శాంతియుత పరిష్కారానికి భారత్ ప్రయత్నాలు







**విశ్వంభర, ఇటలీ:**

ఇటలీలో జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ నేతలతో వరుసగా సమావేశమయ్యారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీలతో విడివిడిగా భేటీ అయ్యారు. ఈ సమావేశాలకు సంబంధించిన వివరాలను మోడీ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

**భారత్-ఫ్రాన్స్ సంబంధాల బలోపేతానికి ప్రాధాన్యత**

మా స్నేహితుడు మేక్రాన్‌తో సమావేశం అద్భుతంగా జరిగింది. ఈ ఏడాదిలో ఇది మాకు నాలుగో భేటీ. భారత్ ఫ్రాన్స్ సంబంధాల బలోపేతానికి మేం ఇచ్చే ప్రాధాన్యతకు ఇది నిదర్శనం. రక్షణ రంగం, భద్రత, టెక్నాలజీ, ఏఐ (కృత్రిమ మేధ), సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ, తదితర రంగాలపై ఇరువురం చర్చించుకున్నాం. వచ్చే నెలలో పారిస్ ఒలింపిక్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మేక్రాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశాను అని వివరించారు.

**రక్షణ సంబంధాలపై చర్చ**

ఇక, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తో సమావేశం ఆహ్లాదకరంగా సాగిందని మోడీ వెల్లడించారు. ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, బ్రిటన్ తో సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతానికి మా చిత్తశుద్ధిని సునాక్ ఎదుట పునరుద్ఘాటించారు. సెమీ కండక్టర్లు, టెక్నాలజీ, వాణిజ్యం తదితర రంగాల్లో పటిష్ఠ సంబంధాలకు గొప్ప అవకాశాలు ఉన్నాయి. రక్షణ సంబంధాలను కూడా మరింత దృఢతరం చేసుకునేందుకు నేను, రిషి సునాక్ చర్చించుకున్నాం అని మోదీ వెల్లడించారు.

**జెలెన్ స్కీ తో చర్చలు ఎంతో ఫలప్రదం**

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో మోడీ సమావేశానికి ఇరు దేశాల అధికారులు కూడా హాజరయ్యారు. జెలెన్ స్కీని ఆలింగనం చేసుకున్న మోడీ ఆత్మీయంగా వీపు తట్టారు. అనంతరం ఇరువురు అనేక అంశాలపై చర్చించుకున్నారు. జెలెన్ స్కీతో చర్చలు ఎంతో ఫలప్రదంగా సాగాయని మోదీ పేర్కొన్నారు. ఉక్రెయిన్ తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై భారత్ ఆసక్తిగా ఉందన్న విషయాన్ని జెలెన్ స్కీకి తెలియజేశానని వెల్లడించారు. అయితే ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో, మానవీయ విలువల ఆధారిత దృక్పథాన్ని విశ్వసిస్తుందని, శాంతి స్థాపనకు చర్చలు, దౌత్య విధానాలే మార్గమని నమ్ముతున్నామని జెలెన్ స్కీకి తెలియజేసినట్టు ప్రధాని మోడీ వెల్లడించారు.



## బాబు అలా సెట్ చేశాడు..


**విశ్వంభర, విజయవాడ:** ఏపీ మంత్రులకు చంద్రబాబు నాయుడు శాఖలను కేటాయించారు. అందరూ ఊహించినట్టుగానే పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎం పదవిని కేటాయించారు చంద్రబాబు. దీంతో పాటు ఆయనకు కీలక శాఖలను కేటాయించారు. ఇక చంద్రబాబు తన వద్ద కీలక శాఖలను ఉంచుకున్నారు. అందులో సాధారణ పరిపాలన శాఖ, శాంతి భద్రతలు, జీఏడీ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ వీటితో పాటు మంత్రులకు కేటాయించని శాఖలను తన వద్ద ఉంచుకున్నారు. అందరు ఊహించినట్లుగానే జన సేనాని పవన్‌కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు కేటాయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లోకేశ్ నిర్వర్తించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా వంటి కీలక శాఖల బాధ్యతలు ఈసారి పవన్ కల్యాణ్‌కు కేటాయించడం విశేషం.

**అప్పుడు వనితకు.. ఇప్పుడు అనితకు**

శుక్రవారం ఉదయం నుంచి ఎవరికీ అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా తన నివాసంలో శాఖల కేటాయింపుపై సుదీర్ఘ కసరత్తు చేసిన చంద్రబాబు, శాఖల వ్యవహారాన్ని ఓ కొలిక్కి తెచ్చారు. టీడీపీ ప్రభుత్వ చరిత్రలో తొలిసారిగా ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి చెందిన మహిళా నేత వంగలపూడి అనితకు కీలకమైన హోం శాఖ బాధ్యతలు అప్పగించడం విశేషం.ఇక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదటి రెండున్నరేళ్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు హోం శాఖను అప్పగించారు నాటి సీఎం జగన్. ఆ తర్వాత రెండున్నరేళ్లు కొవ్వూరు ఎమ్మెల్యే తానేటి వనితకు హోం శాఖను కేటాయించారు. వీరిద్దరూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే విశేషం. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ సైతం ఎస్సీ మహిళకే హోం శాఖను అప్పగించింది. ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా విజయం సాధించిన తర్వాత హోంశాఖను సబితా ఇంద్రారెడ్డికి కేటాయించారు.

**మంత్రులకు కేటాయించిన శాఖలు**

- **కొణిదెల పవన్ కళ్యాణ్:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అండ్ గ్రామీణ నీటి సరఫరా, అటవీ పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ,
- **నారా లోకేష్** : ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి, ఆర్టీజీ
- **కింజరాపు అచ్చెన్నాయుడు** : వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య
- **కొల్లు రవీంద్ర** : గనులు అండ్ భూగర్భం, అబ్కారీ
- **నాదెండ్ల మనోహర్** : ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
- **పొంగూరు నారాయణ** : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి
- **వంగలపూడి అనిత** : హోం అండ్ విపత్తు నిర్వహణ
- **సత్య కుమార్ యాదవ్** : ఆరోగ్య, కుటుంబ సంక్షేమం అండ్ వైద్య విద్య
- **నిమ్మల రామానాయుడు** : జల వనరుల అభివృద్ధి
- **ఎన్ఎండీ ఫరూఖ్** : న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమం
- **ఆనం రామనారాయణ రెడ్డి** : దేవాదాయ శాఖ
- **పయ్యావుల కేశ్** : ఆర్థికశాఖ, అసెంబ్లీ వ్యవహారాలు
- **అనగాని సత్యప్రసాద్** : రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్
- **కొలుసు పార్థసారథి** : గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాలు
- **డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి:** సాంఘీక సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయం అండ్ విలేజ్ వలంటీర్
- **గొట్టిపాటి రవికుమార్:** విద్యుత్
- కందుల దుర్గేష్ : టూరిజం, సాంస్కృతిక అండ్ సినిమాటోగ్రఫీ
- **గుమ్మడి సంధ్యారాణి** : మహిళా అండ్ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం
- **బీసీ జనార్దన్ రెడ్డి** : రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు.
- **టీజీ భరత్:** పరిశ్రమలు అండ్ వాణిజ్యం, ఆహారశుద్ధి
- **ఎస్.సవిత:** బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్
- **వాసంశెట్టి సుభాష్** : కార్మిక - కర్మాగార బాయిలర్స్ అండ్ వైద్య బీమా సేవలు
- **కొండపల్లి శ్రీనివాస్:** ఎంఎస్ఎంఈ, సెర్ప్
- **మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి:** రవాణా శాఖ, యువజన అండ్ క్రీడలు



## పాఠ్యపుస్తకాల్లో 'ముందుమాట' వివాదం.. డైరెక్టర్ పై వేటు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలుగు పాఠ్యపుస్తకం ముందు మాటలో తప్పులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ శ్రీనివాసచారి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డిపై చర్యలకు ఆదేశించింది. పాఠ్యపుస్తకాల బాధ్యతల నుంచి శ్రీనివాసచారి, రాధారెడ్డిని తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమేశ్‌కు బాధ్యతలు అప్పగించారు. టీఆర్ ఈఐఎస్ కార్యదర్శి రమణ కుమారికి ముద్రణ సేవల విభాగం డైరెక్టర్ గా బాధ్యతలు కేటాయించారు. తెలంగాణలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసిన తెలుగు వాచకం పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోనున్నారు. పంపిణీ చేయని వాటిని పిల్లలకు ఇవ్వకుండా నిలిపివేశారు. 24 లక్షల పుస్తకాల్లోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, అధికారుల పేర్లను ముద్రించారు. ఏళ్ల క్రితం నాటి ముందుమాటలో మార్పులు చేయకుండా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. బుధవారం పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న సమయంలో ముందుమాటలోని తప్పులను చాలాచోట్ల ఉపాధ్యాయులు గుర్తించి విద్యాశాఖ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఆ పేజీని చించేయాలని ఆదేశించిన అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆ పేజీని తొలగిస్తే దాని వెనుకున్న వందేమాతరం, జాతీయ గీతం, ప్రతిజ్ఞ లేకుండా పోతాయి. అప్పుడు మరిన్ని విమర్శలు వస్తాయని భావించారు. దీంతో పిల్లలకిచ్చిన, ఇవ్వని పుస్తకాలన్నీ వెనక్కి తీసుకోవాలని పాఠశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన డీఈవోలను ఆదేశించారు.

## జగన్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నా

- ప్రభుత్వానికి విలువైన సలహాలు ఇవ్వాలి
- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు జగన్ రావాలని తాను కోరుకుంటున్నానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శాసనసభకు వచ్చి ప్రభుత్వానికి విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. అంతే తప్ప అసెంబ్లీకి రాకుండా ఉంటే గెలిపించిన ప్రజలు కూడా క్షమించరని పయ్యావుల కేశవ్ అన్నారు. గతంలో చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న దివంగత నేత పీజేఆర్‌ను ఇంటికి వెళ్లి కలిశారని మంత్రి పయ్యావుల కేశవ్ గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండాలని ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షం సమర్థవంతంగా వివిధ అంశాలు వినిపించగలిగితే ప్రభుత్వం కూడా లోటుపాట్లు చేయకుండా ఉంటుందని పయ్యావుల కేశవ్ అన్నారు.

## త్వరలో 13వేల టీచర్ పోస్టుల భర్తీ: కోమటిరెడ్డి

విశ్వంభర, నార్కట్ పల్లి: తెలంగాణ నిరుద్యోగులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఇవాళ తన స్వగ్రామం అయినటువంటి నార్కట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే 13వేల కొత్త టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ మరో మూడు నెలల్లో పూర్తి చేసి.. సాగునీటిని అందిస్తామన్నారు. గ్రామంలోని పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేస్తామని మాటిచ్చారు. బ్రాహ్మణవెల్లంలలో కొత్త పాఠశాల భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అత్యాధునిక వసతులతో కొత్త పాఠశాల భవనం ఉంటుందని చెప్పారు. ఆ పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభం చేయిస్తానని తెలిపారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

## 'విద్యాశాఖకు సీఎం చేసింది గాడిద గుడ్డే'



- మద్యం శాఖకు మంత్రి ఉన్నారు.. కానీ విద్యాశాఖకు వద్దా?
- పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం
- వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలి
- బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖకు ఏమీ చేయలేదని, ఏదైనా చేసి ఉంటే గాడిద గుడ్డు మాత్రమే చేశాడని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ ఎద్దేవా చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణలో మద్యం శాఖకు మంత్రి ఉన్నారని, మరి విద్యాశాఖకు మంత్రి వద్దా అని ఆమె ప్రశ్నించారు. బడిబాట ఇప్పటికే మొదలైందని, కానీ ఈ శాఖకు రేవంత్ ఇంకా మంత్రిని నియమించలేదని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని, పుస్తకాలపై గత ముఖ్యమంత్రి, పాత విద్యాశాఖ మంత్రి పేర్లు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు చూసి చెప్పే వరకు ఇవి బయటకు రాని పరిస్థితి ఉందని చురకలంటించారు. పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందనేందుకు ఇది నిదర్శనమన్నారు. విద్యాశాఖ ఒక దిక్కు దివానా లేని శాఖలా మారిందని రుద్రమ మండిపడ్డారు. విద్యాశాఖకు మంత్రి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆమె పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం రాగానే మద్యం శాఖకు మంత్రిని పెట్టారని, కానీ విద్యాశాఖ కు మాత్రం మంత్రిని నియమించలేదని ధ్వజమెత్తారు. వాస్తవానికి ప్రతి జిల్లాకు డీఈవో ఉండాలని, కానీ 26 జిల్లాలకు డీఈవోలే లేరని ఆమె ఘాటు విమర్శలు చేశారు. 62 డిప్యూటీ ఈవో పోస్టులకు ఒక్కరు కూడా డ్యూటీలో లేరని మండిపడ్డారు. 617 మండలాలకు ఎంఈవోలు ఉండాలని, కానీ కేవలం 17 మంది మాత్రమే ఎంఈవోలు ఉన్నారని, 598 మండలకు లేరని రాణిరుద్రమ పేర్కొన్నారు. పాఠశాలలలో మరుగుదొడ్లు కడిగేందుకు స్కావెంజర్లు లేక దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 22 వేల టీచర్ల పోస్టులు ఖాళీలుంటే నోటిఫికేషన్ ఇచ్చింది 11 వేల పోస్టులకే అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించే అర్హులు ఎవరు లేరా అని ప్రశ్నించారు. విద్యాశాఖను పర్యవేక్షణ చేసే సమయం లేనప్పుడు ఆ శాఖను సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఎందుకు పెట్టుకున్నట్లని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని రాణి రుద్రమ డిమాండ్ చేశారు.

# ‘నీట్’గా ఉత్తరాది ట్రాప్




ఒకే దేశము ఒకే పరీక్ష అనేది బీజేపీ ప్రభుత్వ నినాదం అందులో భాగంగానే 2016లో ఏర్పడింది నీట్ పరీక్ష విధానం ఈ పరీక్ష విధానానికి అసలు కారణం దక్షిణాదిలో అద్భుతంగా అమలవుతున్న వైద్య విద్య విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికి మరియు ఎంట్రన్స్ ఎగ్జామ్స్ పేరుతో కోట్లాది రూపాయల అక్రమ వసూళ్లకు కుంభకోణాలకు పాల్పడుతున్నది గుజరాత్ మరియు ఉత్తరాది పెట్టుబడిదారులు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో కొనసాగుతున్న ఈ దందాలో భాగంగానే సుమారు 24 లక్షల మంది దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు దేశవ్యాప్తంగా 2024 ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే నీట్ పరీక్ష ఫలితాలు ప్రకటించడం యొక్క ఆంతర్యం ఏమిటంటే ఈ పరీక్షలో ప్రశ్నాపత్రాలు లీకేజ్ కావడమే కాకుండా మార్కుల దందా జరిగింది అనే ఆరోపణలు లక్షలాది మంది విద్యార్థులు, కోట్లాదిమంది తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మే 5 2024న నీట్ పరీక్ష జరిగితే జూన్ 14న రావలసిన పరీక్ష ఫలితాలు జూన్ 4నే ఎందుకు ప్రకటించారు. అందులో ప్రపంచమంతా భారత దేశ సార్వత్రిక ఎన్నికల ఫలితాల వైపు చూస్తుంటే జాతీయ టెస్టింగ్ సెంటర్ ఆరోజే నీట్ పరీక్షా ఫలితాలు ప్రకటించడం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును ఫణంగా పెట్టి అక్రమ దందా చేసి కోట్లాది రూపాయల పరీక్షా పత్రాల లీక్స్ దందాకు పాల్పడిన కొంతమంది దళారుల ఉచ్చులో ముఖ్యంగా గుజరాత్ దళారులు దేశవ్యాప్తంగా ఈ ప్రశ్నా పత్రాలు లీక్ చేసి కోట్లాది రూపాయలు దండుకున్నట్టుగా విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 180 మార్కుల ప్రశ్నాపత్రం 720 మార్కులు సాధించిన వ్యక్తి మొదటి ర్యాంకర్ గా నిలిచే ఈ పరీక్షలో 717, 718, 719 మార్కులు రావడానికి అవకాశం లేదు ఎందుకంటే ఒక ప్రశ్నకు నాలుగు మార్కులు ఉండగా ఒక మైనస్ మార్కు ఉంటుంది. అలాంటప్పుడు 714 లేదా 715 మార్కులు మాత్రమే వస్తాయి తప్ప పైన పేర్కొన్న మార్కులు రావు. ఎన్‌టీఏ చెప్పిన వివరాల ప్రకారం మార్కులు అదనంగా కొన్ని సెంటర్లో కలిపిన కారణంగా అలా వచ్చాయని వివరించారు. ఎందుకంటే అక్కడ కొంతమంది విద్యార్థులకు టైం వేస్ట్ అయినందున ఈ మార్కులు కలిపాము అని ప్రకటించడం నీట్ పరీక్ష విధానానికి విరుద్ధం. గ్రేస్ మార్కులు కలిపితే టైం వేస్ట్ జరిగిన అన్ని కేంద్రాలకు కలపాలి కానీ కొన్ని కేంద్రాలకు మాత్రమే ఎందుకు కలిపారు అలాగే టైం వేస్ట్ అయితే ఎక్స్ట్రా టైం ఇవ్వాలి. అంతేగాని ఎక్కువ మార్కులు ఎందుకు కలపాలి. అలాగే 2019, 2020 లలో ఒకే ఒక్క టాపర్ ఫస్ట్ ర్యాంక్ వస్తే 2023లో ముగ్గురు టాపర్స్‌కు ఫస్ట్ ర్యాంకు వచ్చింది. కానీ 2024లో 67 మంది టాపర్స్‌కు ఫస్ట్ ర్యాంకు ఎలా వచ్చింది.? అలాగే రాజస్థాన్లోని ఒకే సెంటర్లో ఏడుగురికి ఒకే సీరియస్ నంబర్ విద్యార్థులకు ఎలా టాపర్స్ అయ్యారు గుజరాత్, హర్యానా, పాట్నా లాంటి సెంటర్లలో పేపర్ లీక్ అయిందని సోషల్ మీడియాలో క్వశ్చన్ పేపర్స్ తో సహా పెడితే అలాంటి పరీక్షను రద్దు చేయకుండా పది రోజుల ముందు పరీక్ష ఫలితాలు ఎలా ప్రకటిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు వెళ్లిన విద్యార్థులు పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని అభ్యర్థించినప్పటికీ సుప్రీంకోర్టు పరీక్ష రద్దును కాకుండా పరీక్షల్లో జరిగిన అవకతవకలను సమీక్షిస్తామని మధ్యంతర ఉత్తర్వుల పేర్కొంది. ఇలా సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న వెంటనే పూర్తిగా బయటపడకముందే గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు ఆ మార్కులు రద్దు చేసింది కేంద్ర ప్రభుత్వం. కానీ తిరిగి పరీక్ష నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు.

ఇది గమనించిన దక్షిణాది రాష్ట్రాలు ఈ పరీక్షను వ్యతిరేకించాయి. ముఖ్యంగా తమిళనాడు దీనికి ఎగైనెస్ట్ గా అసెంబ్లీ తీర్మానం చేయడమే కాకుండా దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను రద్దు చేయాలని సుప్రీంకోర్టు వరకు వెళ్ళింది. ఎందుకంటే దక్షిణాదిలో అత్యధికంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఉన్న ఎంబీబీఎస్ సీట్లను కొల్లగొట్టడానికి, అలాగే దక్షిణాదిలో వైద్య సీట్ల పట్ల దేశవ్యాప్తంగా కోచింగ్‌ల పేరు మీద కోట్లు సంపాదించడానికి కేంద్రం కుట్ర చేస్తున్నదని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించింది. అందుకే దీన్ని రద్దు చేయాలని కోర్టులను ఆశ్రయించింది. దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు నీట్ పరీక్షలో ఫెయిల్ అయి అందులో జరుగుతున్న అక్రమాలకు బలై ఆత్మహత్యలు చేసుకుంటున్న కారణంగా గతంలో ఏ విధంగా అయితే ప్రతిభా ఆధారంగా వారికి ఇంటర్లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించారు. అదే విధంగా ప్రతి రాష్ట్రంలోనూ జరగాలని, లేదంటే ఆయా రాష్ట్రాలే తమకు నచ్చిన పద్ధతిలో పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన తమిళనాడుకు నిరాశ ఎదురైంది. 2024 నీట్ ఎంట్రన్స్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కూడా తగిన న్యాయం జరగలేదు. అందుకే దేశవ్యాప్తంగా విద్యార్థులు నీట్ పరీక్షను రద్దు తిరిగి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు నీట్ పరీక్ష పై పూర్తిగా సమీక్షించి అందులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి దోషులకు 2024 పరీక్షల నిర్వహణలో అక్రమాలపై తీసుకొచ్చిన చట్ట ప్రకారం శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అలాగే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలపై సుప్రీంకోర్టు న్యాయమైన జడ్జిమెంట్ విద్యార్థులకు ఇస్తుందని ఆశిద్దాం



- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్
మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా "ఉస్మానియా & తెలంగాణ విశ్వ విద్యాలయం,
ఫోన్: 93901 19889

# ఆ బాలుడు... బహుముఖ ప్రతిభా సంపన్నుడు

ఆంగ్ల రచనలతో అబ్బుర పరుస్తున్న స్నితిక్ పటేల్

ఆరోగ్యకర అంశాలతో కథల రూపకల్పన


ఈ పుస్తకానికి ముందు మాట రాసి ఆశీర్వదించిన కలెక్టర్

కథలను విశ్లేషించి శభాష్ అన్న కేంద్ర బాల సాహిత్య అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ









సరదాగా ఆడుకోవాల్సిన సమయంలో ఆ బాలుడు కలం పట్టి కథలు రాయడానికి పూనుకున్నాడు. అందరి పిల్లల్లా ఆటలు ఆడుకోకుండా మెదడుకు పదును పెట్టి 12 ఆణిముత్యాల్లాంటి ఆంగ్ల కథలను రాశాడు. 11 ఏండ్ల వయస్సులోనే ఆంగ్లంలో కథలు రాసి ఎందరో ప్రముఖుల తలలూపించిన ఆ బాలతేజం మాస్టర్ సాయిని స్నితిక్‌పటేల్. చురుకుదనమే పెట్టుబడిగా సృజనాత్మకతే ఇంధనంగా అలరించి మెప్పించే కథలు అల్లి అతి చిన్న వయస్సులోనే పుస్తకంగా వెలువరించి ఔరా అనిపించిన స్నితిక్‌కు అత్యంత ప్రతిష్టాత్మకమైన బాలరత్న అవార్డు దక్కింది. స్నితిక్ రాసిన ఆంగ్ల కథల పుస్తకానికి ముందుమాట రాసినప్పటి కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్ పుస్తకాన్ని ఆవిష్కరించగా ఆ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ప్రముఖ సినీగేయ కవి డాక్టర్ వెనిగళ్ల రాంబాబు, ప్రఖ్యాత రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ అతని కథారచనా ప్రతిభను కొనియాడారు. కేంద్ర బాలసాహిత్య అకాడమిక్ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ కూడా స్నితిక్ పుస్తకానికి అభిప్రాయం రాసి ఆ కథలను ప్రశంసిస్తూ ఆశీర్వదించారు. ప్రొఫెసర్ అర్జున్‌రావు, డాక్టర్ అందెశ్రీ, డాక్టర్ మామిడి హరికృష్ణ, డాక్టర్ కేవీ రమణాచారి, ఆకెళ్ల, డాక్టర్ పత్తిపాక మోహన్, తపస్వి, డాక్టర్ బోనాల ప్రకాశ్, పొత్తూరి సీతారామరాజు, డాక్టర్ బెల్లంకొండ సంపత్‌కుమార్ వంటి ప్రముఖులు, పలువురు బాల సాహితీవేత్తలు, కథకులు, ఉపాధ్యాయులు స్నితిక్ ప్రతిభను అభినందించారు. పలు సంస్థల సత్కారాలు, పురస్కారాలను కూడా ఈ బాలుడు సొంతం చేసుకున్నాడు. చదువుల్లో మేటిగా రాణిస్తూ కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు, స్నేహితుల ప్రశంసలు అందుకుంటున్న స్నితిక్‌లోని బహుముఖ ప్రతిభకు హ్యాట్సాఫ్. కరీంనగర్‌లో నివసించే డాక్టర్ విద్యశ్రీ, నరేందర్‌లకు స్నితిక్ పటేల్, ఆదిత్ పటేల్ ఇద్దరు కుమారులు. వృత్తిరీత్యా తల్లిదండ్రులు వైద్యులు కావడం వల్ల కరోనా సమయంలో ఆ పిల్లలిద్దర్ని వారి అమ్మమ్మ గారింట్లో ఉంచారు. డాక్టర్ నరేందర్ పల్మనాలజీలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు కావడం వల్ల కరోనా రోగులను ఆ సమయంలో చూడడం వల్ల ఈ ఇద్దరు పిల్లలను వాళ్లకు దూరంగా అమ్మమ్మ ఇంట్లోనే ఉంచారు.

**స్నితిక్ అలవాట్లు**

స్నితిక్ ఒక్కసారి చూసాడంటే ఏ విషయాన్నైనా అదే తడవుగా మెదడులో నిక్షిప్తం చేసుకొని కాగితంపై అక్షర రూపంలో పెట్టేవాడు. చురుకుదనంతో పాటు క్రమశిక్షణ కూడా స్నితిక్‌కు ఎక్కువ. పరిసరాలను పరిశీలించే ఆసక్తిని స్నితిక్ ఎక్కువగా పెంపొందించుకున్నాడు.

**అమ్మమ్మ ప్రోత్సాహం**

స్నితిక్ అమ్మమ్మ పత్తెం వసంత కవయిత్రి, రచయిత్రి కావడం వల్ల స్నితిక్ చిన్నప్పటి నుంచి కవి సమ్మేళనాల్లో అమ్మమ్మతోపాటు పాల్గొంటూ ఉండేవాడు. పుస్తకాలు చదవడంలో ఎంతో ఆసక్తిని కనబరిచేవాడు. అమ్మమ్మతో కవి సమ్మేళనాలకు, బుక్ ఫెయిర్‌లకు కూడా వెళ్ళి కథల పుస్తకాలు కొనిమ్మని అడిగి మరీ తెచ్చుకొని చదవడం కూడా అలవాటు చేసుకున్నాడు. కరోనా సమయంలో పాఠశాలలు లేక చిన్నవారైన ఇద్దరు అన్నదమ్ముల అల్లరి గొడవలు తీర్చలేక వాళ్ళ అమ్మమ్మ నీవు కూడా ఏవైనా కథలు రాయమని స్నితిక్‌కు కొన్ని పుస్తకాలను ఇచ్చింది. స్నితిక్ ఏ విషయాలు అయితే నిశితంగా పరిశీలిస్తున్నాడో వాటినే కథల రూపంలో రాయడం మొదలు పెట్టాడు. ఆంగ్లంలో మాట్లాడడానికి పెద్దలే భయపడతారు. కానీ ఈ 11 ఏళ్ల బాలుడు ఆంగ్లంలో అద్భుతంగా కథలు రాయడం నిజంగా విశేషమే. 11 సంవత్సరాలకే 12 ముత్యాల్లాంటి కథలను స్నితిక్ పటేల్ ఎంతో గొప్పగా రాశాడు.

**12 కథలలో ది 12 పెరల్స్**

- ది 12 పెరల్స్‌గా నామకరణం చేసి తల్లిదండ్రులకు అంకితం చేసిన స్నితిక్ కిడ్డీ స్టోరీస్‌గా ఉపశీర్షికగా చేర్చాడు.
- ఒక్కొక్క కథను ఒక్కో విశిష్ట భావజాలంతో రాయగా చదువరులను ఇట్టే ఆకట్టుకుంటుంది.
- అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఇతని కథలు ఆసాంతం చదివి ప్రత్యేకంగా అభినందించారు.
- కలెక్టర్ తన ముందుమాటలో వర్తమాన రచయితగా స్నితిక్‌ను అభివర్ణించారు.
- వివిధ అంశాలతో, మానవీయ విలువలతో కూడిన 12 కథలు సంపుటిలో ఉన్నాయి.

**స్నితిక్‌కు రాష్ట్ర స్థాయి అవార్డులు**

1. శ్రీ కమలాకర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు కమలాకర్ లలిత కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో బాలరత్న రాష్ట్ర స్థాయి పురస్కారం 2022
2. అస్తిత్వ సంస్థ బాలమేధావి 2023 పురస్కారం.

- చైతన్య జర్నలిస్ట్

# ఆధునిక కవిత్వ మార్పులకు ఆద్యుడు శ్రీ శ్రీ

**జూన్ 15.. మహాకవి శ్రీ శ్రీ వర్ధంతి**



ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగా లబ్ద ప్రతిష్టులైన శ్రీశ్రీ (ఏప్రిల్ 30, 1910 – జూన్ 15, 1983). విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వారిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా ఆయన సుప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికులు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందారు. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చానని గర్జించిన.. విప్లవ కవి.. సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన మహాకవి. తెలుగు పాటకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి. తెలుగు పాటకు తొలిసారి జాతీయ స్థాయిలో అవార్డు తెచ్చిన మహనీయుడు.

శ్రీశ్రీ పుట్టిన దినం గురించి, ఫిబ్రవరి 1, 1910న జన్మించానని ఆయన విశ్వసించినా, పరిశోధకులు కొందరు 1910 ఏప్రిల్ 15న జన్మించారని పేర్కొన్నా, విశాఖపట్నం పురపాలక సంఘం వారు ఖరారు చేసిన తేదీనే 1910 ఏప్రిల్ 30 అని విరసం వారు స్పష్టీకరించారు. శ్రీరంగం సూర్య నారాయణకు దత్తుడగుట వలన ఇతను ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేసారు. 1925లో ఎస్ ఎస్ ఎల్ సీ వుత్తీర్ణుడు అయినారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బియ్యే (జంతుశాస్త్రము) పూర్తి చేసారు.

1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్ స్ట్రేటరుగా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లో, మిలిటరీలో, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహా ప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం అది.

1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ మరిన్ని గొప్ప రచనలు చేసారు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాసారు. 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 1956లో సరోజను రెండవ భార్యగా వివాహ మాడారు. 1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరపున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్లో ఒక ప్రచార సభలో, ఆయన ఆరోగ్యం దెబ్బతిని, కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో, శ్రీశ్రీ, వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి, ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

శ్రీ శ్రీ ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి “రాజా లక్ష్మీ ఫౌండేషను” అవార్డు తదితరాలు. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసారు. 1970లో ఆయన షష్టిపూర్తి ఉత్సవం సందర్భంగానే అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. 18 వ ఏట 1928 లో “ప్రభవ” అనే కావ్య సంపుటిని ప్రచురించారు. 1950 లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారు.1952 లో ప్రారంభమైన ఆయన సినీగేయ ప్రస్థానం 1982 వరకు నిరాటంకంగా కొనసాగింది. దాదాపు 50 చిత్రాల వరకు సినీ సాహిత్యాన్ని అందించారు. తెలుగు వారిని ఉర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను అయన రచించారు. అల్లూరి సీతా రామరాజు సినిమాకు రాసిన “తెలుగు వీర లేవరా..” అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. రెండవ భార్య సరోజతో కలిసి సినిమాలకు మాటలు రాసారు.

**తెలుగులో ఆహుతి డబ్బింగ్ సినిమా మాటలు పాటలు రాశారు.**

బి.విఠలాచార్యతో పరిచయం కలిగిగాక, అయన కన్నడలో తీసిన కన్యాదానం అనే సినిమాను తెలుగులో కూడా నిర్మించదలచి శ్రీశ్రీని రచయితగా నియమించు కున్నారు. శ్రీ శ్రీ మైసూరులో వుండి ఒక్క రోజులో 12 పాటలు వ్రాశారు. ఇది ప్రపంచ చలనచిత్ర లోకంలో ఒక రికార్డు! మనసున మనసై (డాక్టర్ చక్రవర్తి) హాలో హాలో ఓ అమ్మాయి (ఇద్దరు మిత్రులు) నా హృదయంలో నిదురించే చెలి (ఆరాధన) తెలుగు వీర లేవరా (అల్లూరి సీతారామరాజు) పాడవోయి భారతీయుడా (వెలుగు నీడలు) శ్రీ శ్రీ గీతాలలో కలికితురాయిలు.

ప్రాసకూ, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. "వ్యక్తికి బహువచనం శక్తి" అనేది అతను సృజించిన మహత్తర వాక్యమే! తెలుగు సాహిత్యంలో సామాన్యుడి కష్టనష్టాల గురించీ, పేదసాదల జీవితాలని ప్రతిబింబించే కవిత్వాన్ని రాసిన మొదటి కవిగా ఆయన ఆంధ్రులందరికీ చిరస్మరణీయుడు.తెలుగు సాహిత్యంలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. కదిలేదీ, కదిలించేదీ, పెనునిద్దర వదిలించేదీ, పరిపూర్ణపు బతుకిచ్చేదీ, కావాలోయి నవకవనానికి’, అని ఎలుగెత్తి అభ్యుదయ కవిత్వపు నిజలక్షణాలన్నీ నిర్వచించాడు శ్రీ శ్రీ. కవిత్వాన్ని పాత పరిధులని దాటించి, కొత్త పరిధుల్లోకి దూకించాడు.

గణబద్ధ ఛందస్సులకి స్వస్తి చెప్పి, అతి ప్రాచీనమయిన మాత్రాబద్ధ ఛందస్సులకి నూతన యవ్వనం ప్రసాదించాడు. అనువదించినా, అనుసరించినా తనవైన శైలీ, గొంతూ ద్వారా శ్రీశ్రీ మహాకవిగా పరిణతి చెందాడు. అందుకు పాశ్చాత్య ఆధునిక రచయితల ప్రభావం ఎంతో దోహదం చేసింది. కమ్యూనిజం, సోషలిజం, సమానత్వం, సమసమాజ నిర్మాణం వంటివి శ్రీశ్రీ గారి ప్రధాన కవితా వస్తువులు.

తెలుగే మన జాతీయ భాష కావాలనేది తన అభిమతం అన్నారు. ఇది భాషా దురభిమానంతో అంటున్న మాటకాదని, తెలుగు భారతదేశం అంతకీ జాతీయభాష కాగల అర్హత గలదని జె.బి.యస్. హాల్డేన్ అన్నారని, సంస్కృత పదాలను జీర్ణించుకున్న కారణంచేత, అటు ఉత్తరాదివారికీ, ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటి కావడంవల్ల ఇటు దక్షిణాది వారికీ, తెలుగు నేర్చుకోవడం చాలా సులభమని హాల్డేన్ పండితుని వాదనతో శ్రీ శ్రీ ఏకీభవిస్తున్నానన్నారు.

- రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు: కలెక్టర్ క్రాంతి వల్లూరి

**విశ్వంభర, కంది:**

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తుండడం గొప్ప విషయమని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కంది మండలంలోని కంది, కాశీపూర్, చర్లగూడెం గ్రామాల్లోని మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యత కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో చక్కటి ప్రణాళికతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయడం జరుగుతుందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తప్పని సరిగా పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకే బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ



ఆదేశాల మేరకు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడం ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. పాఠశాలల్లో పనులతో పాటు, విద్యార్థులకు యూనిఫార్మ్స్ ను మహిళా సంఘాల ద్వారా కుట్టించే ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే పాఠశాల పనులలో అందరినీ భాగస్వామ్యం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో బోధన జరుగుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. బడిబాట కార్యక్రమాల ద్వారా పాఠశాలల్లో కల్పించిన వసతులు, నాణ్యమైన విద్యా బోధన గురించి తల్లిదండ్రులకు వివరిస్తూ తరగతి గదులలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు తరచూ తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థులకు అందిస్తున్న బోధన, విద్యార్థులు కనబరుస్తున్న ప్రతిభను వివరించాలని తెలిపారు. పిల్లలు బడికి ఎక్కువ రోజులు బడికి సెలవు పెడితే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని ,పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని అన్నారు. పిల్లలకు అన్నిటికంటే ముఖ్యమైనది చదువేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు సద్గుణ, ఏం.ఈ.ఓ వెంకటనర్సింలు, మండల నోడల్ అధికారి జోగప్ప, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గోవులను వధించిన తరలించిన నేరం: డీఎస్పీ వెంకట్ రెడ్డి

**విశ్వంభర, తూప్రాన్ :** ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను తరలించడం కానీ వధించడం కానీ నేరమని సూపరం డీఎస్పీ వెంకటరెడ్డి అన్నారు. ఆవులను తరలిస్తున్నట్లు ఎలాంటి సమాచారం ఉన్న తమకు వెంటనే ఫోన్ చేయాలని తెలిపారు. తూప్రాన్ మనోహరాబాద్ మండలాలకు చెందిన వివిధ పార్టీల మత పెద్దలతో పీస్ కమిటీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. త్యాగానికి ప్రతిరూపం బక్రీద్ పండుగ అని కులమతాలకు తావు లేకుండా ముస్లింలు పవిత్రంగా పండుగ చేసుకోవాలని కోరారు. మతసామరస్యానికి ప్రేమ భవానికి సంతోషంగా జరుపుకునే పండుగ అని అన్నారు. ఒకరి పండుగ సాంప్రదాయాలను మరొకరు గౌరవించడం సాంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ కృష్ణ, తూప్రాన్ ఎస్సై శివానందం, మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు, రబ్బాని, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ దారుణ హత్య



**విశ్వంభర, శేరిలింగంపల్లి:** మహిళను గొంతుకోసి దారుణంగా హత్య చేసిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ప్రాథమిక సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన విజయలక్ష్మి (32) నల్లగండ్లలోని లక్ష్మీ విహార్ లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. శుక్రవారం ఓ వ్యక్తి ఆమె ఇంటిలోకి ప్రవేశించి కత్తితో విజయలక్ష్మీ గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారైన నిందితుడు చందానగర్ పోలీస్ స్టేషన్ కు వచ్చి లొంగిపోయినట్లు సమాచారం. అక్రమ సంబంధమే మహిళ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఘటన స్థలికి చేరుకున్న క్లూస్ టీం, చందానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గొడుగు అడ్డుపెట్టి బైక్ డిక్కీలో ఉన్న 80వేలు చోరీ



**విశ్వంభర, నల్గొండ:** నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రకాశం బజారులో ఘరానా దొంగలు చెలరేగిపోయారు. పిల్లల చదువుకోసం తిప్పర్తి మండలం పెద్ద సూరరం గ్రామానికి చెందిన రోజువారీ కూలి గుండె వెంకన్న తన సెంట్రల్ యూనియన్ బ్యాంకులో నుంచి 80 వేల రూపాయలు విత్ డ్రా చేసుకొని బైక్ డిక్కీలో భద్రపరిచాడు. తన కూతురు కోసం బ్యాగ్ తీసుకుందాం అని బైక్ పక్కన ఆపి షాప్ లోకి వెళ్ళగానే అతని బైక్ వద్ద ఇద్దరు వ్యక్తులు గొడుగు అడ్డం పెట్టి తన బైక్ డిక్కీ లాక్ ని పగలగొట్టి 80 వేల రూపాయలు చాకచక్యంగా కొట్టివేశారు. వెంటనే తన కూతురు డయల్ 100 కి కాల్ చేసింది. స్పందించిన పోలీసులు అక్కడి స్థానిక వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్ ఐ శంకర్ వారి సిబ్బంది స్థలానికి చేరుకొని దొంగతనం చేసిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీసీ ఫుటేజిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. డబ్బు కోల్పోయిన వ్యక్తి రోదన మిన్నంటింది.

## కొనసాగుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

**విశ్వంభర, ఇల్లందు:** వర్షాకాలం సమిపిస్తున్న తరుణంలో మున్సిపల్ పరిధిలో ముందస్తుగా 1,2 వార్డులలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ గురువారం కొనసాగింది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ రాధా కృష్ణ ఉదయాన్నే పారిశుద్ధ్య కార్మికులతో పాటే వెళ్లి అక్కడ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం వచ్చే లోపు శానిటేషన్ పనులన్నీ పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యంగా చేసుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల శ్రమను వృధా చేయకుండా పట్టణ ప్రజలందరూ కార్మికులకు సహకరించాలని కోరారు. చెత్తను ఎట్టి పరిస్థితిలో బయట వేయకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కటకం పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.



# కనబడకుండా పోయిన బాలిక అనుమానాస్పద మృతి

**విశ్వంభర, శేరిలింగంపల్లి :**

aబాలిక మిస్సింగ్ ఘటన విషాదాంతం అయింది. వారం రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబబాద్ జిల్లా మర్రిపేడ మండల్ లక్ష్మన్ తండాకు చెందిన బానోతు నరేష్, శారద దంపతులు బ్రతుకుదెరువు నిమిత్తం గత 20 రోజుల క్రితం నగరానికి వలస వచ్చి మియాపూర్ నడిగడ్డ తండాలో ఉంటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బానోతు నరేష్ దంపతుల కుమార్తె వసంత(13)ను చదువు కోమని తండ్రి మందలించడంతో మనస్థాపం చెంది ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లింది. పని నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తల్లికి ఇంట్లో కూతురు కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు మియాపూర్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే గత వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వసంత శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వంద మీటర్ల దూరంలోనే శవమై కనిపించింది. మయూరి నగర్ కాలనీ వెనక ఉన్న నిర్మానుశ్య ప్రదేశంలో కుళ్లిపోయిన స్థితిలో బాలిక మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించిన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే 7 రోజులుగా కనబడకుండా పోయిన బాలిక ఇంటికి సమీపంలోనే దొరకడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇంటి సమీపంలో ఆమె తల్లిదండ్రులు వెతకలేదా..? లేదా బాలికను ఎక్కడైనా హత్య చేసి తిరిగి ఇక్కడ పడేశారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.



## రైల్వే ప్లాట్ ఫాం వద్ద గొడవ.. వ్యక్తి మృతి

**విశ్వంభర, నిజామాబాద్:** నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో ప్లాట్ ఫాం వద్ద గొడవ జరిగింది. ఈ గొడవలో ఒక వ్యక్తిని మరొక వ్యక్తి నెట్టి వేయడంతో అతను కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో నాందేడ్ జిల్లాకు చెందిన సతీష్ శర్మ, రాజులు గొడవపడ్డారు. గొడవలో సతీష్ శర్మ రాజును నెట్టి వేయడంతో రాజు ప్లాట్ ఫాం పై పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలిపారు.

## నకిలీ వస్తువులను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్, మరో ఇద్దరు పరార్



**విశ్వంభర, మీర్ పేట్:** అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో నిరుపేద ప్రజలను మోసం చేస్తూ ఉత్తరప్రదేశ్, ముంబైల నుండి రవాణా చేస్తూ సోనీ, ఆపిల్ కంపెనీ కి చెందిన నకిలీ వస్తువులను విక్రయిస్తున్న ఓ ముఠాను గురువారం రాత్రి ఎల్బీనగర్ ఎస్ ఓ టీ పోలీసులు అదుపులోకి తీసుకుని మీర్ పేట్ పోలిసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షారుక్ ఖాన్ (24) రాజేందర్ నగర్ కు చెందిన షేక్ మన్సూర్ లు (35) లు స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్తర్ ప్రదేశ్,ముంబై నుంచి రవాణా చేస్తూ నకిలీ సోనీ కంపెనీ ఎల్ఈడి టీవీలు ,ఆపిల్ కంపెనీ కి చెందిన ఐ ఫోన్లు, వివిధ కంపెనీల వస్తువులు విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్ ఓ టి పోలీసులు దాడి చేసి ఇద్దరి నిందితులను అరెస్ట్ చేయగా మరో ఇద్దరు నిందితులు దిల్దార్ ఖాన్, జాఫర్ లు పరారైనట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 43 అంగుళాల 30 నకిలీ సోనీ బ్రాండ్ ఆండ్రాయిడ్ టీవీలు, 04 డూప్లికేట్ ఐఫోన్ 15 మాక్స్ ప్రో, 2 మొబైల్ ఫోన్లు, 80 సోనీ బ్రాండ్ లేబుల్స్,3 5 సోనీ కొత్త సిరీస్ లేబుల్స్, 05, 43 అంగుళాల లేబుల్స్, 08 సోనీ ఫైవ్ స్టార్ లేబుల్ షీట్లు, 20 సోనీ బ్రావియా స్కానర్ లేబుల్ షీట్స్, 26 సోనీ యోనో గ్రాయ్ లు, 20 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును మీర్ పేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బాలాపూర్ లో యువకుడి దారుణ హత్య..



**విశ్వంభర, బడంగ్ పేట్ :** ఇంట్లో ఉన్న 19 సంవత్సరాల యువకుడిని ఫోన్ చేసి బలవంతంగా బయటికి పిలిపించుకొని కత్తులతో అతి కిరాతకంగా హతమార్చిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపుతోంది. పాత కక్ష్యల కారణంగానే యువకుడిని హతమార్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బాలాపూర్ ఇన్స్పెక్టర్ భూపతి తెలిపిన వివరాల ప్రకారం... కంచన్ బాగ్ హాఫీజ్ బాబానంగర్ కు చెందిన సయ్యద్ మునీర్ కుమారుడు సయ్యద్ సమీర్ (19) కార్ డెకర్ లో పని చేసేవాడు. గత రెండు నెలలుగా ఇంట్లోనే ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి 11.30 గంటలకు సమీర్ కు ఒక ఫోన్ కాల్ రావడంతో ఇప్పుడే వస్తానని చెప్పి బయటికి వెళ్ళాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన 15 నిమిషాలకే సమీర్ బాలాపూర్ డైమండ్ హోటల్ పక్కన గుర్రం చెరువు పక్కన రక్తపు మడుగులో పడి ఉన్నాడు. కాసేపటికే అనుమానంతో తండ్రి సయ్యద్ మునీర్ కొడుకు సమీర్ కు ఫోన్ చేయగా అతను రక్తపు మడుగులో పడిఉన్నాడని స్థానికులు తెలిపారు. దీంతో తండ్రి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్న కుమారుడిని చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. రెండు నెలల క్రితం హాఫీజ్ బాబా నగర్ కు చెందిన మొహమ్మద్ సోహైల్ సమీర్ ల మధ్య వివాదమే హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసును బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ కు ప్రజాస్వామ్య వ్యవస్థ పై గౌరవం లేదు

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**విశ్వంభర, మహబూబ్ నగర్:** బీఆర్ఎస్ పార్టీకి ప్రజాస్వామ్య వ్యవస్థ పైన గౌరవం లేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొనాలని వచ్చినా బీఆర్ఎస్ అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బైకాట్ చేశారని, ఇది ప్రజాస్వామ్యాన్ని అవమాన పరచడమేన్నని,ఈ నిర్ణయంతో పవిత్రమైన జడ్పీ వేదిక పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు ఆయన ఎద్దేవా చేశారు. గత ఐదు సంవత్సరాల పాటు కలిసి పంచుకున్న ఈ జడ్పీ వేదికను,ఎంతో ఆత్మీయంగా చివరి సమావేశాలు నిర్వహించుకుని ఘనంగా వీడ్కోలు చెప్పుకొనే అవకాశాన్ని బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు జారవిడుచుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను తగిన గుణపాఠం చెబుతారని



ఆయన అన్నారు. ప్రజలు ఎన్నో ఆశలు,ఆశయాలతో కేసీఆర్ ను ఎమ్మెల్యే గా ఎన్నుకుంటే, ప్రతిపక్ష నాయకుడి హోదాలో అసెంబ్లీ లోకి సైతం రాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాడని,ఎమ్మెల్యే గా ఉండే అర్హత ఆయనకు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి,దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,జడ్పీ సిఈఓ రాఘవేంద్ర రావు,ఎంపీపీలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి బీఆర్ఎస్ జడ్పీటీసీ లు బైకాట్...**

శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశాన్ని 13 మంది బీఆర్ఎస్ జడ్పీటీసీలు, కోఆప్షన్ సభ్యులు బహిష్కరించారు.

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై కలెక్టర్ అసహనం

**విశ్వంభర, నంగునూరు:** జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట గ్రామ పరిధిలో గల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సుమారు 300 కోట్ల నిర్మాణ వ్యయంతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నట్లు టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఇప్పటి వరకు పనులు మందకొడిగా సాగుతున్నందున అసహనం వ్యక్తం చేస్తూ నిర్ణీత కాల పరిమితి లోపు తప్పనిసరి గా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చెయ్యాలని హెచ్చరించారు. ఆయిల్ ఫెడ్ అధికారులు మ్యాప్ ను చూపిస్తూ నిర్మాణ దశలను, ఇప్పటివరకు వాటర్ ట్యాంక్, పాంపౌండ్ నిర్మాణం, కార్యాలయం భవనం దాదాపు పూర్తి కావచ్చాయని అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఇక్కడ ఇసుక కొరత ఉన్నందున కమిషనర్ స్థాయిలో మాట్లాడి భూపాలపల్లి నుండి ఇసుక డంపు చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా పూర్తి



చేయాలని కాంట్రాక్టర్ల లకు తెలపాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్లు తమకు కేటాయించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట దిగుబడి మొదలవుతున్న క్రమంలో ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా పూర్తి చేసి రైతులకు లాభం చేకూర్చేలా ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు ఉన్నారు.

# యువతలో 'రక్తం' ఉడికించారు

- రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి స్ఫూర్తిగా నిలిచిన సామాజికవేత్త
- జగిత్యాల జిల్లా కోరుట్లకి చెందిన కటుకం గణేష్ సేవలు ఎన్నో



ప్రసవ సమయంలో మహిళకు సకాలంలో రక్తం అందక కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ప్రత్యక్షంగా అక్కడే ఉన్న ఆయన చలించి వెంటనే ఓ మిత్రునితో రక్తదానం చేయించి తల్లి బిడ్డల సుఖ ప్రసవానికి దోహదపడ్డారు.

రక్తదానంపై నానాటికి యువతలో సరైన అవగాహన లేకపోవడం, లేనిపోని భయాలకి గురవడం ఇంకా లేకపోలేదని చెబుతున్నారు. దీంతో ఇప్పటికీ అత్యవసర సమయాలలో బాధితులకు సకాలంలో రక్తం అందక ఎందరో మృత్యువాతకు గురవుతున్నారు. ఈ ఉద్యమం కోరుట్ల పట్టణానికే పరిమితం కాకుండా జగిత్యాల, కరీంనగర్, మెట్‌పల్లి, ఆర్మూర్, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు సైతం గణేష్ విన్నపంతో రక్తదానం చేసిన దాతలు కోకొల్లలు.

సామాజిక దృక్పథానికి చిహ్నంగా తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 2015లో ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి, ఇప్పుటి మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ చేతుల మీదుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉత్తమ సామాజిక సేవకుడిగా 2015 లో అవార్డు అందుకున్నారు.

అలాగే ప్రొఫెసర్ జయశంకర్ స్మారక రాష్ట్రస్థాయి పురస్కారం, కాళోజీ పురస్కారం, గ్రామీణ కళాజ్యోతి జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు, కోరుట్ల కు చెందిన ఈ తరం యూత్ ద్వారా బెస్ట్ బ్లడ్ మోటివేటర్2010 అవార్డు, జగిత్యాల కళాశ్రీ వారిచే రాష్ట్రస్థాయి అవార్డు, కోరుట్ల కు చెందిన శాంతి యూత్ ద్వారా సామాజిక సేవకుడిగా ఉగాది పురస్కారం, రక్తదానంపై విశేష కృషి చేస్తూ యువతలో అవగాహన కల్పించినందుకు ఐ.బి యూత్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు పురస్కారం అందుకున్నారు. అలాగే కేరళ హై స్కూల్ వారి ఆధ్వర్యంలో సినీ నటుడు శివారెడ్డి చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు అందుకున్నారు. మెట్ పల్లి స్నేహాలయ యూత్ ద్వారా రక్తదాన అవార్డు, జగిత్యాల జిల్లా యువజన సంఘాల సమితి ద్వారా రాష్ట్రస్థాయి అవార్డు, ఆహా ఫౌండేషన్ ద్వారా సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు.

కోరుట్ల ఒకినోవ మార్షల్ ఆర్ట్ వారి ద్వారా రాష్ట్రస్థాయి అవార్డు, తెలుగు వెలుగు ఫౌండేషన్ ద్వారా జాతీయ మహానంది అవార్డును2022 వేములవాడలో అందుకున్నారు. అంజలి మీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సేవా రత్న2023 అవార్డు, జీర్డ్స్ సేవా పురస్కార్2024 అవార్డు, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ అసోసియేషన్ వారు విశిష్ట రక్తదాన సంధానకర్త అవార్డు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్మారక పురస్కార్ 2024 అవార్డు అందుకున్నారు. ఇలా ఎన్నో ఎన్నెన్నో అవార్డులను, ప్రశంసలను, పురస్కారాలను గణేష్ అందుకున్నారు.



## కటుకం గణేష్ కు అవార్డు ప్రదానం

**విశ్వంభర, కోరుట్ల:** జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతోపాటు ఎనలేని సేవలు చేసిన రక్తదాతలకు అవార్డు సర్టిఫికెట్ ప్రదానోత్సవం చేశారు. ఈ సందర్భంగా కోరుట్లకు చెందిన సామాజికవేత్త, రక్తదాన సంధానకర్త, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కటుకం గణేష్‌ను ఘనంగా అభినందిస్తూ అవార్డు సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్, కతురోజ్ శ్రీనివాస్, మంచాల కృష్ణ, కొమురవెల్లి వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సమిరుద్దీన్, టీవీ సూర్యం, ఏవీఎల్ఎన్ చారి, డాక్టర్ ప్రవీణ్, రామకృష్ణ, నరేష్, డాక్టర్ త్రిశ్నా తదితరులు పాల్గొన్నారు.

## మాధవరెడ్డికి సన్మానం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదోన్నతిపై వచ్చి ప్రధానోపాధ్యాయులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మహాదేవ రెడ్డిని ఆత్మకూరు (ఎం) మండల భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి అధ్యక్షులు గడ్డం సతీష్ గౌడ్, ఆలేరు నియోజకవర్గ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహ్మద్,ఆలేరు నియోజకవర్గ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు పంజల రాజు గౌడ్, విద్యార్థి విభాగం మండల నాయకులు యాస మహేందర్ రెడ్డి, గట్టు విశాల్, నాతి వినయ్, ఎలగందుల సాయికుమార్, కొమరాజుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలి



**విశ్వంభర, కేశంపేట :** పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని జెడ్పీటీసీ సభ్యురాలు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, మండల విద్యాధికారి టి.మనోహర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఏ. స్వప్న ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి రవీంద్ర నాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం హాజరయ్యారు. ముందుగా సరస్వతి చిత్రపటానికి చిన్నారులతో కలిసి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థి విద్యార్థులకు పలకలు ఇచ్చి స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులను చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలతో పాటు ఉచితంగా ఏకరూపదుస్తులను అందిస్తారని, వీటిని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ అరుణకుమారి, జి మాధవి,శ్రీదేవి, విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో సీజనల్ వ్యాధులపై అవగాహన

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో సీజనల్ వ్యాధులపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఉక్కుర్తి రమేష్ మాట్లాడుతూ, గృహసముదాయాల పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా చూడాలని కోరారు. గృహ పరిసరాల్లో చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. ఇండ్లలో తడి పొడి చెత్తను వేరువేరుగా చెత్తబుట్టలలో వేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు ట్రాలీలో వేరువేరు అరలలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంతోష, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ బట్టు వైష్ణవి, ఐకేపీ వివోఏ నోముల సరిత, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు ఏన్ రవిందర్ రెడ్డి,గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**విశ్వంభర, నారాయణపూర్:** అనారోగ్యంతో మృతి చెందిన యువకుడికి అనాధ ఆశ్రమ నిర్వాహకులు ఆర్థిక సాయం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన మాదరమోని ఇంద్రపాల్ (23) అనారోగ్యంతో బాధపడుతూ తెల్లవారు జామున మృతి చెందారు. వెంటనే వారి కుటుంబానికి మాతృదేవోభవ అనాధ ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి పరామర్శించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నిమ్మల నగేష్ సమక్షంలో అంత్యక్రియలకు 10,000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గట్టు గోపాల్,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





## మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఆరా

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామపంచాయతీ లో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటయ్య శుక్రవారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ నల్లా కనెక్షన్లు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. మిషన్ భగీరథ నల్లాల ద్వారా తాగునీటి సరఫరా విధానంపై ఆయన ప్రజలనడిగి తెలుసుకున్నారు. కనెక్షన్ లేని వారు గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండ వాసులు విజయ్ రాథోడ్.కవిత. ఝాన్సీ, ప్రియాంక, హంజి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి

**ఆమనగల్లులో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసనలు**



**విశ్వంభర, ఆమనగల్లు:** ఇటీవల విడుదల అయిన నీట్ ఫలితాలలో అవకతవకలు జరిగిన కారణంగా అనేక మంది విద్యార్థుల ఆందోళన దృష్ట్యా పరీక్షను వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఎన్ ఎస్ యూ ఐ కార్యదర్శి ఎండి ఫరీద్ ఆధ్వర్యంలో ఆమనగల్లు మండల ప్రజాపరిషత్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి పార్టీల పొత్తులపై ఉన్న శ్రద్ధ ,విద్యార్థుల భవిష్యత్తుపై లేదని, జరిగిన ఆత్మహత్యలకు ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కారణం అని ,విద్యార్థులకు సరైన న్యాయం చేయకపోతే ఎన్ఎస్ యూఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉద్రుతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూఐ నాయకులు జాజిమొగ్గల మహేష్ , అబ్దుల్ , రాహుల్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ నాయక్,అలీం, నాసర్ , మహేష్ , తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్ర చిహ్నాన్నిరూపొందించాలి

**విశ్వంభర, నారాయణపూర్:** భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర నూతన చిహ్నాన్ని రూపొందించాలని ధర్మ సమాజ్ పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల అధ్యక్షులు కొప్పు సంజీవ్ డిమాండ్ చేశారు. ధర్మసమాజ్ పార్టీ తరపున ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. తాము ప్రభుత్వానికి నివేదించిన ప్రతిపాదన నమూనా చిత్రాన్ని ఆమోదించాలని శుక్రవారం నారాయణపురం మండల తహసీల్దార్ కి ఆయన వినతిపత్రం అందజేశారు. ధర్మసమాజ్ పార్టీ నమూనా ప్రతిపాదన చిత్రంలో అంబేద్కర్, ఉస్మానియా యూనివర్సిటీ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, పండగ సాయన్న, సమ్మక్క సారలక్క చిత్రాలు ఉన్నాయని తెలిపారు. అణగారిన వర్గాల పోరాట యోధుల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ మహనీయుల చిహ్నంలో పొందుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొప్పు సంజీవ్, మండల నాయకులు జలంధర్, సాయికుమార్, సందీప్, నగేష్ ,నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.



# అదంతా తప్పుడు ప్రచారమే

- పార్టీ వీడటంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి క్లారిటీ



**విశ్వంభర, వరంగల్:** ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోయిన గులాబీ పార్టీ.. లోక్ సభ ఎన్నికల్లోనైతే మరీ ఘోర ఓటమిని చవి చూసింది. ఏకంగా పోటీ చేసిన 17 పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ ఒక్క చోట కూడా విజయం సాధించలేదు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ లోక్ సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బీజేపీతో పోటీ పడలేక మూడవ స్థానానికి పరిమితమైంది. ఈ ఘోర ఓటమితో పార్టీ చరిత్రలోనే ఫస్ట్ టైమ్ బీఆర్ఎస్ లోక్ సభలో ప్రాతినిధ్యం కోల్పోయింది. ఎన్నికల్లో వరుస ఓటములతో గులాబీ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో ఆ పార్టీ నేతలు పక్క చూపులు చూస్తున్నారు. ఇప్పటికే కొందరు పార్టీని వీడగా.. మరి కొందరు సైతం త్వరలోనే గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఈ క్రమంలోనే మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తారని పొలిటికల్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. కారు దిగి మాజీ మంత్రి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీ మార్పు వార్తలపై ఎర్రబెల్లి దయాకర్ రావు ఎట్టకేలకు స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం లేదని.. అదంతా తప్పుడు ప్రచారమని క్లారిటీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఖండించారు. తాను కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవ్వడం లేదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. కాగా, గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుండి పోటీ చేసిన ఎర్రబెల్లి.. 26 ఏళ్ల కాంగ్రెస్ అభ్యర్థిని యశ్వసిని రెడ్డి చేతిలో ఓటమి పాలైన విషయం తెలిసిందే. దయాకర్ రావు రాజకీయ అనుభవం అంతా వయస్సు లేని మహిళ చేతిలో మాజీ మంత్రి మంత్రి ఓటమి పాలు కావడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపింది.

## అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



**విశ్వంభర, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలో జూన్ 15 బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో 9వ అంగన్వాడీ సెంటర్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బడిబాట లో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మండల పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. సరస్వతి అమ్మవారి చిత్రపటానికి పూజలు నిర్వహించి చిన్నారులకు పలకలపై అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పాలు గుడ్లు పౌష్టికాహారం తో పాటు కేంద్రాలలో పిల్లలకు ప్రత్యేకంగా ఆటపాటలతో చదువు చెప్పడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు సరళ, టీ స్వరూప, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



**విశ్వంభర, నారాయణఖేడ్:** నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ప్రభుత్వం ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులను అందజేస్తుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విఠల్ అన్నారు. మండల పరిధిలోని చీరపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు శుక్రవారం ఏకరూప దుస్తులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని, అందులో భాగంగానే పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా పుస్తకాలు, పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనం కింద అందజేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి స్వయంగా విద్యార్థులకు వడ్డించారు.

ఈ కార్యక్రమంలో చిలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రాచారి, ఉపాధ్యాయులు ప్రవీణ్, గోపి రత్న, ఉమా ప్రసన్న తదితరులు ఉన్నారు.

# దడపుట్టిస్తోన్న ఉల్లి, టమోటా

- 15 రోజుల్లోనే అమాంతం పెరిగిన ధరలు
- అధిక ఉష్ణోగ్రతలతో తగ్గిన కూరగాయలు దిగుబడి
- వేసవిలో నియంత్రణలోనే ఉన్న టమాటా ధరలు
- వర్షాలు ప్రారంభం కావడంతో కొత్త పంటలు సాగు



విశ్వంభర, హైదరాబాద్ : వేసవిలో అదుపులో ఉన్న కూరగాయలు ధరలు... వర్షాకాలం మొదలవగానే రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. కేవలం 15 రోజుల వ్యవధిలోనే ఉల్లి, టమాట సహా అన్ని కూరగాయల ధరలు 60% వరకు అధికంగా పెరిగాయి. మే మూడో వారంలో కిలో రూ.20 పలికిన ఉల్లి.. ప్రస్తుతం రూ.40కి చేరింది. ఇక, టమాటా ధర కూడా రెండింతలు పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో టమాటా రూ.50కిపై మాటే పలుకుతోంది. వంకాయలు, బీన్స్, క్యారట్, బీట్‌రూట్, క్యాప్సికం, సొరకాయ, కాకరకాయ తదితరాలతోపాటు పచ్చిమిర్చి, పుదీనా, కొత్తిమీర ఇతర ఆకుకూరల ధరలు రెట్టింపయ్యాయి.కూరగాయల ధరలు పెరగడానికి వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు కూడా ఓ కారణం. వడగాల్పుల కారణంగా రైతులు, వ్యాపారులు కూరగాయలను ఎక్కడికక్కడే అమ్ముకోవడంతో మార్కెట్‌పై కూరగాయల కొరత ఏర్పడుతుంది. ఈ క్రమంలో టమోటాలు, ఉల్లి దిగుమతి తగ్గి ధరలు పెరిగాయి. అలాగే, స్థానికంగా కూరగాయల ఉత్పత్తి 20% వరకు తగ్గింది. జూన్ మొదటి వారంలో వర్షాలు ప్రారంభం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న కూరగాయలు తడిసి, త్వరగా కుళ్లిపోతున్నాయి. దీంతో వ్యాపారులు దిగుమతులను తగ్గించారు. హైదరాబాద్ నగర జనాభాకు రోజుకు దాదాపు 3,300 టన్నుల కూరగాయలు అవసరం. వారం రోజులుగా అన్ని హోల్‌సేల్ మార్కెట్లకు 2,800 టన్నులు మాత్రమే వస్తున్నాయి. అయితే, ఒక్క హైదరాబాద్ మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొందని నిపుణులు చెబుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే మరికొన్ని రోజుల్లో కూరగాయల ధరలు ఇంకా పెరిగితే వంటింటి బడ్జెట్ మరింత పెరగనుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొత్తపంట వచ్చే వరకూ ధరలు ఇలాగే కొనసాగుతాయని అంటున్నారు. మే నెలలో బోర్లు, చెరువుల కింద సాగుచేస్తోన్న పంట.. ఈ నెలాఖరుకు కొంతమేరకు దిగుబడులు వచ్చే వీలుంది. అలాగే, వర్షాకాలం సీజన్ పంటల సాగు కూడా ప్రారంభమైంది. ఇవి జులై, ఆగస్టు నెలల్లో వచ్చే అవకాశం ఉంది. ఆయా ఉత్పత్తులు మార్కెట్లలోకి వస్తే ధరలు తగ్గుతాయని అధికారులు తెలిపారు.



## ట్రైనీ ఐఏఎస్‌లకు సజ్జనార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**విశ్వంభర, నారాయణగూడ:** ఆర్టీసీ అమలు చేస్తోన్న పలు కార్యక్రమాలను అధ్యయనం చేయడానికి ట్రైనీ ఐఏఎస్ లు బస్ భవన్ ని శుక్రవారం సందర్శించారు. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమాలను వారికి వివరించారు. ఆర్టీసీ పనితీరు, ఉద్యోగుల సంక్షేమం, మహాలక్ష్మి పథకం అమలు, ప్రయాణికులకు కల్పిస్తోన్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ కేడర్ కి చెందిన 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ లు ప్రస్తుతం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్ఆర్డీ)లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రాం శిక్షణ తీసుకుంటున్నారు. బస్ భవన్ ను సందర్శించిన వారిలో ట్రైనీ ఐఏఎస్ లు ఉమా హారతి, గరిమా నరులా, మనోజ్, మృణాల్, శంకేత్, అభిజ్ఞాన్, అజయ్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ముని శేఖర్, కృష్ణకాంత్ లతో పాటు ఎంసీఆర్ హెచ్ఆర్డీ సీడీఎస్ సెంటర్ హెడ్ డాక్టర్ కందుకూరి ఉషారాణి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం హుసేని



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం హుసేని నియామకమయ్యారు. మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శుల కేంద్ర కార్యవర్గ సభ్యులు హాజరవగా హుసేని (ముజీబ్) ను ఏకగ్రీవంగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. పర్వతాలు ఉపాధ్యక్షులుగా, రాగి శ్రీనివాస్ కార్యదర్శిగా, జ్ఞానేశ్వర్ సింగ్ కార్యదర్శిగా, గూడ ప్రభాకర్ కార్యదర్శిగా ,షఫీ అహ్మద్ కార్యదర్శిగా, గీతా రాణి కార్యవర్గ సభ్యురాలుగా, శ్రీపతి ఉమాదేవి, ఉపాధ్యక్షురాలుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఎస్.ఎం హుసేని మాట్లాడుతూ, త్వరలో ఉద్యోగుల సమస్యల సాధనకు ముఖ్యమంత్రిని కలిసి చర్చించి పరిష్కరించుకుంటామని అన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగులకు నెలకు రూ.500 చందాతో EHS సౌకర్యాన్ని కల్పించాలని, పి ఆర్ సి కమిటీ ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోపే తమ నివేదికని ప్రభుత్వానికి సమర్పించాలని వారు కోరారు.





## అక్కడ భూ రక్షణ.. ఇక్కడ ధరణి మైనస్! కేసీఆర్, జగన్ ఓటమికి కారణం ఇదే

### సీపీఐ నారాయణ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రుల పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతుల నిరసనలను జగన్ పట్టించుకోక పోవడమే జగన్ ఓటమికి కారణం అన్నారు. అదే విధంగా తెలంగాణలో కేసీఆర్ ధరణి స్కీమ్ తో పతనమైతే... ఆంధ్రప్రదేశ్ లో భూ రక్షణ పథకంతో జగన్ ప్రభుత్వం పడిపోయిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులను, భూముల సమస్యలను పట్టించుకోకపోవడమే వీరిద్దరి ఓటమికి కారణమని నారాయణ అభిప్రాయపడ్డారు. ఇక, ఎన్నికల్లో ఘన విజయం సాధించి నాలుగో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబుకు ఈ సందర్భంగా నారాయణ అభినందనలు తెలిపారు. ఇక తెలంగాణలో గతేడాది డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోగా... ఇటీవలే జరిగిన ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితం అయ్యి అధికారాన్ని కోల్పోయింది.

## డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్




**విశ్వంభర, హైదరాబాద్:** డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. డీఎస్సీ రాయాలంటే డిగ్రీలో ఉండాల్సిన కనీస మార్కుల శాతాన్ని ప్రభుత్వం తగ్గించింది. ఇక నుంచి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 45%, ఇతరులకు 40% మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం జీవో విడుదల చేశారు. అయితే, ఇప్పటివరకు జనరల్ కేటగిరి అభ్యర్థులకు 50 శాతం మార్కులు, ఇతరులకు 45 శాతం మార్కుల నిబంధనను ప్రభుత్వం అమలు చేసేది. తాజాగా ప్రభుత్వం ఐదు శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో టీచర్ పోస్టుల భర్తీకి జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో తెలిపిన మార్కుల శాతానికి సవరణలు చేస్తున్నట్లు జీవోలో తెలపింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజీ పండిట్, పీఈటీ తదితర పోస్టుల మార్కుల శాతాన్ని తగ్గించారు. దీంతో భాషా పండితులు, పీఈటీలకు కనీస మార్కుల నిబంధన వర్తించదు.

## జైలు నుంచి బయటకు వచ్చిన నటి హేమ


**విశ్వంభర, బెంగళూరు:** సినీ నటి హేమ ఈ నడుమ వరుసగా వార్తల్లో ఉంటుంది. ఆమెకు సంబంధించిన చిన్న విషయం కూడా ఇప్పుడు ఓ రేంజ్ లో వైరల్ అవుతోందనే చెప్పుకోవాలి. ఇక తాజాగా ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు. బెంగుళూరు రేవ్ పార్టీ డ్రగ్స్ కేసులో ఆమె అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే ఆమెకు గురువారం షరతులతో కూడిన బెయిల్ ను మంజూరు చేశారు. దాంతో తాజాగా ఆమెను జైలు నుంచి విడుదల చేశారు. కొన్ని రోజుల క్రితం బెంగుళూరులోని శివారులో ఫామ్ హౌస్ లో జరిగిన రేవ్ పార్టీలో హేమ మాదకద్రవ్యాలు సేవించిందని పోలీసుల పరీక్షల్లో తేలింది. దాంతో ఆమెను అరెస్ట్ చేశారు. ముందు తాను అసలు ఏ రేవ్ పార్టీకి వెళ్లలేదంటూ బుకాయించే ప్రయత్నాలు చేసింది. కానీ పోలీసులు ఆధారాలతో ఆమె డ్రగ్స్ తీసుకుందని బయటపెట్టడంతో ఆమె అడ్డంగా బుక్కయింది. ఇక కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కానీ గురువారం ఆమెకు షరతులతో కూడిన బెయిల్ రావడంతో బయటకు వచ్చింది. హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవని.. ఆమె తరపున న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత కోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసింది.



# కత్తులతో పొడిచి వ్యక్తి దారుణ హత్య

**విశ్వంభర, హైదరాబాద్:** ఇటీవల చిన్నపాటి గొడవలకు విచక్షణ కోల్పోయి ప్రాణాలు తీస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో మరో దారుణ ఘటన వెలుగుచూసింది. అందరూ చూస్తుండగానే ఓ యువకుడిని వెంబడించి కత్తులతో అతిదారుణంగా హత్య చేశారు. బాలాపూర్‌లోని రాయల్ కాలనీలో ఈ ఘటన జరిగింది. ఓ వ్యక్తిని ముగ్గురు రౌండప్ చేసిన దుండగులు కత్తులతో పొడిచారు. రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బాలాపూర్‌లోని రాయల్ కాలనీలో ఉంటున్న సమీర్ (28) అనే యువకుడిని పలువురు దుండగులు వెంబడించారు. సమీర్ చిక్కగానే అందరూ రౌండప్ చేశారు. అందులో ఓ వ్యక్తి కత్తితో సమీర్ కడుపుతో పొడిచాడు. మరో ఇద్దరు అతడిని రాళ్లు, కర్రలతో దారుణంగా కొట్టారు. దీంతో సమీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. హత్య అనంతరం ముగ్గురు నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. హత్యా సమయంలో ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఆ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ హత్యకు పాతకక్షలే కారణమా లేక ఆర్థిక వ్యవహారమా? మరేదైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చేస్తున్నారు.



## ఆర్టీసీ బస్‌కింద పడి ఇంటర్ విద్యార్థిని దుర్మరణం



**విశ్వంభర, హైదరాబాద్:** ఆర్టీసీ బస్‌కింద పడి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని దుర్మరణం చెందింది. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధి యూసుఫ్ గూడా బస్టాండ్ వద్ద జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. యూసుఫ్ గూడాలోని మాస్టర్స్ కాలేజీలో మెహరీన్ అనే విద్యార్థిని ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. శుక్రవారం ఉదయం బస్సు నిండా ప్రయాణికులతో నిండిపోగా బస్సు ముందు భాగంలో ఫుట్ బోర్డుపై నిలబడింది. ఈ క్రమంలో బస్సు దిగడానికి ప్రయత్నించడంతో మూలమలుపు వద్ద విద్యార్థిని అదుపుతప్పి కిందపడిపోయింది. బస్సు వేగంగా వెళ్తుండటంతో డ్రైవర్ గమనించేలోపే ఘోరం జరిగింది. ఫుట్ బోర్డు పైనుంచి జారిపడగా బస్సు చక్రాల కిందపడి మెహరీన్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా మరో ప్రమాదం రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగింది. రుద్రంగి గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకుల్లో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు రుద్రంగికి చెందిన గండి అజయ్. మరో యువకుడు అభికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏసీబీ వలలో మరో చేప

- లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కిన ఇనిస్పెక్టర్



**విశ్వంభర, హైదరాబాద్:** రెండు వారాల క్రితమే సిసిఎస్ లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీపీ ఉమామహేశ్వరరావును అరెస్ట్ చేసిన ఏసీబీ వలలో మరో చేప పడింది. తాజాగా ఉప్పల్ లోని ఇనిస్పెక్టర్ సుధాకర్ ఇంట్లో అధికారులు ఉదయం 6 గంటల వరకు సోదాలు నిర్వహించారు.

గురువారం 3 లక్షలు లంచం తీసుకుంటూ సుధాకర్ అధికారులకు దొరికిపోయాడు. నాంపల్లి లోని సిసిఎస్ కార్యాలయం నుంచి తరలిస్తూ ఆయనను అధికారులు కోర్టులో హాజరపరచనున్నారు. వివాదాల్లో ఉన్న ఇంటి పత్రాల కోసం ఆయన లంచం డిమాండ్ చేసి, బాధితుడితో రూ.15 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో బాధితుడు తొలి విడత రూ.5 లక్షలు చెల్లించాడు. సిసిఎస్ వద్ద మరో మూడు లక్షలు తీసుకుంటూ ఇనిస్పెక్టర్ సుధాకర్ అధికారులకు చిక్కాడు.

## మైనార్టీల బలోపేతానికి కృషి చేయాలి

**విశ్వంభర, ఆమనగల్లు:** స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ నుండి మైనార్టీల బలోపేతానికి డిసిసిబి బ్యాంకుల ద్వారా గాని సొసైటీల ద్వారా గాని నిధులు కేటాయించాలని గంప వెంకటేష్ గుప్తాకోరారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబైదుల్లా కొత్వాల్ ని ఉమ్మడి మహబూబ్ నగర్ డిసిసిబి డైరెక్టర్, ఉమ్మడి ఆమనగల్ పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మైనార్టీల బలోపేతానికి కేటాయించిన ఏ కార్పొరేషన్ నిధులైనా.. డిసిసిబి బ్యాంకు ద్వారా లబ్ధిదారులకు అందేలా ప్రయత్నించాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ని కలిసిన వారిలో విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి ఉన్నారు.



## హైదరాబాద్‌లో ధార్ గ్యాంగ్.. ఉదయం రెక్కీ, రాత్రి చోరీలు

**విశ్వంభర, ఉప్పల్ :** గతంలో హైదరాబాద్‌ను వణికించిన చెడ్డీ గ్యాంగ్ తరహాలోనే ప్రస్తుతం ధార్ గ్యాంగ్.. నగరంలో తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఉదయం పూట ఆటోల్లో తిరుగుతూ రెక్కీ చేసి.. రాత్రిపూట మెల్లగా ఆ ఇళ్లను దోచుకుంటున్నారు. అడ్డుకున్న వారిపై దాడులు చేసి.. హతమార్చేందుకు కూడా వెనుకాడటం లేదు. తాజాగా ఈ ధార్ గ్యాంగ్.. ఇళ్లల్లోకి చొరబడిన దృశ్యాలు రికార్డ్ అయిన సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు రిలీజ్ చేశారు. నగరవాసులు ఇలాంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఇక నగరంలోని హయత్ నగర్, అమీన్‌పూర్, వనస్థలిపురం ప్రాంతాల్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ సభ్యులు తిరుగుతూ స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఉదయం వేళల్లో ఆటోల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇక అర్ధరాత్రి కాగానే రెక్కీ నిర్వహించిన ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపై దాడులు చేస్తున్నారు. ఆపై ఇళ్లల్లో ఉన్న బంగారం, డబ్బు, ఇతర విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లిపోతున్నారు.ఇక మరో ఘటనలో గురువారం రాత్రి ఉప్పల్ చిలకానగర్‌లో నివాసం ఉండే పిట్టల సుదర్శన్ (66) ఇంటి ముందు టూలెట్ బోర్డు చూసి ఇద్దరు యువతీయువకులు వచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హిమాన్షి(23), గాంధీ(21) లు.. ఇల్లు అద్దెకు కావాలని సుదర్శన్‌ను అడిగారు. అయితే వేరే రాష్ట్రం వారు కావడంతో ఇల్లు ఇచ్చేందుకు సుదర్శన్ నిరాకరించడంతో.. బలవంతంగా ఇంట్లోకి చొరబడ్డారు. ఆ తర్వాత సుదర్శన్‌తోపాటు అతని భార్యపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. వారి ముఖంపై పెప్పర్ స్ప్రే కొట్టేందుకు ప్రయత్నించగా.. వారు గట్టిగా అరిచారు. ఈ క్రమంలోనే ఆ ఇంట్లో శబ్దాలకు ఇరుగు పొరుగున ఉన్న వారు వచ్చి.. ఆ ఇద్దర్నీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. అద్దె కోసం వచ్చి.. ఓనర్‌పైనే దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇక దొంగలు వచ్చి పోయే దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ కావడంతో పోలీసులు వాటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ వాసులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి.. యజమానులపై దాడి చేసి.. ఇంట్లోని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లడం వీరి ప్లాన్. అయితే ఉదయం పూట వీధుల్లో తిరుగుతూ టూలెట్ బోర్డులు ఉన్న ఇళ్లపై ఓ కన్నేసి రాత్రి వేళ.. ఆ ఇంట్లోకి వెళ్లి దాడి చేస్తూ ఉంటారు.

## హైదరాబాద్‌లో ఒకే రోజు మూడు హత్యలు

**విశ్వంభర, హైదరాబాద్ క్రైం :** హైదరాబాద్‌లో వరుస హత్య ఘటనలు కలకలం రేపుతున్నాయి. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి రాయల్ కాలనీలో సయ్యద్ సమీర్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. చెంపాపేట్ బాబానగర్ కు చెందిన సయ్యద్ సమీర్ ను రాయల్ కాలనీ వద్ద తల్వార్ తో దారుణంగా హత్యచేసి పారిపోయారు గుర్తుతెలియని దుండగులు. డెకరేషన్ వర్క్ చేసే సమీర్ రాయల్ కాలనీ నుండి ఇంటికి వస్తుండగా హత్య జరిగింది. బాలాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశంలో చాలా మంది ఆకతాయిలు గాంజా సేవించి తరుచు గొడవలకు దిగుతుంటారని స్థానికుల చెబుతున్నారు. కేసు నమోదు చేసి.. సమీర్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో మరో దారుణ హత్య చోటు చేసుకుంది. చందానగర్ పీఎస్ పరిధిలోని నల్లగండ్లలో విజయ లక్ష్మి అనే మహిళను కత్తితో గొంతు కోసి దారుణ హత్య చేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన విజయలక్ష్మిని హత్య చేసిన నిందితుడు భరత్ గౌడ్ చందానగర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. విజయలక్ష్మి, భరత్ గౌడ్ మధ్య వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలు విజయలక్ష్మి తన భర్త ఇద్దరు పిల్లలతో కలిసి నలగండ్లలో నివాసం ఉంటూ అపర్ణ సర్వర్ క్యాంటీన్లో వంట మనిషిగా పనిచేస్తుంది.

అటు హైదరాబాద్ లోని ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. కుతుబ్బుద్దీన్ అనే యువకుడిపై కత్తులతో పొడిచి పారిపోయారు గుర్తు తెలియని వ్యక్తులు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని స్థానికులు మెహిదీపట్నం నాల నగర్ లోని ఆలివ్ ఆసుపత్రికి తరలించారు.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## తల్లోజు ఆచారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలి

**బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ రాజశేఖర్ మాయని**

**విశ్వంభర, కల్వకుర్తి:** జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకులు తల్లోజు ఆచారిని తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ రాజశేఖర్ మాయని కోరారు. ఈ మేరకు పార్టీ అధిష్టానానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా ఒకే పార్టీలో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తున్న ఆచారి సేవలను గుర్తించాలన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన మనోధైర్యంతో ముందుకు సాగుతున్న ఆచారి రాష్ట్ర అధ్యక్ష పదవికి అన్ని విధాలా అర్హుడని తెలిపారు. బీసీలలో బలమైన నాయకుడైన తల్లూరి ఆచారిని అధ్యక్ష పదవిలో నియమిస్తే పార్టీకి అన్ని విధాలా మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## పాలమూరు ప్రజల రుణాన్ని తీర్చుకుంటా

### ప్రజల రుణాన్ని ఎప్పటికీ మరువను

**జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని మీడియాతో మాట్లాడిన ఎంపీ డీకే అరుణ**



**విశ్వంభర, మహబూబ్ నగర్:** పాలమూరు ప్రజల రుణాన్ని తీర్చుకోవడానికి మరోసారి ప్రజలు తనను గెలిపించారని, వారి రుణాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా బిజెపి ఎంపీ డీకే అరుణ.. తెలంగాణలో దక్షిణ కాశిగా పిలువబడే జోగులాంబ అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో తనను ప్రజలు గెలిపించుకున్నారని తెలిపారు. మహిమాన్విత క్షేత్రంలో ప్రజల కోసం పూజలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజల అభిమానం, అమ్మవారి ఆశీర్వాదంతో గెలిచానని తెలిపారు. ప్రజల సేవకై మరోసారి అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాలమూరు ప్రజల సమస్యల కోసం పార్లమెంట్ లో గళం వినిపించే అవకాశం రావడం ఎప్పటికీ మరువలేనని అన్నారు. పాలమూరు ప్రజలకు సేవ చేసేలా ఆశీర్వదించాలని పూజలు చేశానన్నారు. ఈ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కలిపిచ్చేలా చూస్తానన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే శక్తి తనకివ్వాలని కోరుకున్నట్లు ఎంపీ డీకే అరుణ మీడియాతో తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం కసరత్తు!



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల కోడ్ ముగియడంతో దరఖాస్తుల పరిశీలనపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారలకు సూచించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఇందిరమ్మ ఇళ్లకు 82.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. మరోవైపు ఏడాదికి 4.50లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐదేళ్లలో 22.50లక్షల ఇళ్లు నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, లబ్ధిదారుల ఎంపిక అధికారులకు సవాల్‌గా మారనుంది. దీంతో ఇతర రాష్ట్రాల్లో అమలుచేస్తున్న గృహ నిర్మాణ పథకాలపై అధ్యయనం చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇదిలా ఉంటే దరఖాస్తులతో పోలిస్తే మంజూరు చేసే ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండటంతో లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తామని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు.

## వికారాబాద్‌లో చిరుత కలకలం

**వ్యక్తికి తీవ్రగాయాలు**



**విశ్వంభర, పరిగి:** చిరుతదాడిలో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలంలోని కొత్తపలిల గ్రామంలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చౌడపూర్ మండలంలోని కొత్తపలిల గ్రామ సమీపంలో బాత్రూం వెళ్లిన శేఖర్‌పై చిరుత దాడి చేసింది. దాని బారినుంచి తప్పించుకునే ప్రయత్నంలో అతడికి చేయికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అయితే, శేఖర్‌కు ప్రాణాపాయం తప్పడంతో కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుత ఆనవాళ్లను గుర్తించి బోన్‌లో బంధించి తీసుకువెళ్లాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఐదు నెలల్లోనే ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ విమర్శ
- తరుణ్ చుగ్ తో బండి సంజయ్ భేటీ
- రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చ



**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ను కలిశారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం సంజయ్ తొలిసారిగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజయ్ కు శుభాకాంక్షలు తెలిపిన తరుణ్ చుగ్ ఆయనతో అరగంటకుపైగా ముచ్చటించారు. బండి సంజయ్ ఆ శాఖకు మంచి పేరు తీసుకురావడంతోపాటు ప్రజలకు మరింత మేలు జరిగేలా పనిచేస్తారనే ఆశాభావాన్ని తరుణ్ చుగ్ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. తెలంగాణలో 8 పార్లమెంట్ స్థానాలను గెలిచిన బీజేపీ 35 శాతానికి పైగా ఓట్లు సాధించడంపట్ల సంతోషం వ్యక్తం చేసిన తరుణ్ చుగ్ నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలవల్లే ఇది సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు నెలల్లోనే విశ్వసనీయతను కోల్పోయిందని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న నిరాశను ఎన్నికల ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని, అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చిన ఆ పార్టీ వాటిని అమలు చేయకుండా తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తోందన్నారు. ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌పట్ల ప్రజల్లో ఉన్న ఆగ్రహానికి అద్దం పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందని, కాంగ్రెస్ పార్టీకి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమనే విషయం కూడా పార్లమెంట్ ఫలితాలతో రుజువైందన్నారు.

**సంజయ్‌కు ప్రజాప్రతినిధుల అభినందనలు**

మరోవైపు బండి సంజయ్ కు పలువురు నేతల నుండి అభినందనల పరంపర కొనసాగుతూనే ఉంది. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు కరీంనగర్ తోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం సంజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు సైతం సంజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీలు సీతారాం నాయక్, బీవీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, బీసీ కమిషన్ మాజీ సభ్యులు టి.ఆచారి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, వీరేందర్ గౌడ్, జె.సంగప్ప సంజయ్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

**వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి**



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ పోలీసుల ముందు ఇద్దరు మావోయిస్టు దంపతులు లొంగిపోయారు. వారు తిక్క సుష్మిత @ చైతే ఏరియా కమిటీ మెంబర్, మడకం దూల @ దూల ఏరియా కమిటీ మెంబర్ గా పోలీసులు తెలిపారు. కరీంనగర్ ప్రస్తుత ఇంచార్జ్, వరంగల్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి వివరాల ప్రకారం.. లొంగిపోయిన ఇద్దరు సెంట్రల్ కమిటీ మెంబర్ .. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇంచార్జి వద్ద సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్ గా , దూల ప్రొటెక్షన్ టీం మెంబర్ గా పని చేశారని తెలిపారు. హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత 27, ఇంటర్ వరకు చదువుకుంది. తన తండ్రి అయినా తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతిపరుడుగా పనిచేశాడని తండ్రి అడుగుజాడల్లో సుష్మిత తన చదువు అనంతరం 2016లో ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామ అటవీప్రాంతంలో బడే చొక్కారావు @ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరింది. ఛత్తీస్ గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా , పరియా గ్రామానికి చెందిన మడకం దూల @ దూల ఐదవ తరగతి వరకు చదువుకున్నాడు. తన అన్నయ్య అయినా ఐయేత 2008 సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడని, అతన్ని చూసి ఆకర్షితుడైన దూల 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో సిపిఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి 30 వ తేదీన వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో పలు చోట్ల పనిచేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి, తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులైన వీరిద్దరు వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయలు నగదు రివార్డ్ వున్నదని ఆ మొత్తాన్ని సీపీ చేతుల మీదుగా డీడీ రూపంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజిపేట ఏసీపీ పి తిరుమల్ , హాసనపర్తి ఇనిస్పెక్టర్ జె సురేష్ పాల్గొన్నారు.

## వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని వినియోగించుకోవాలి

**రైతులతో రంగారెడ్డి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి**




**విశ్వంభర, ఆమనగల్లు:** వ్యవసాయ న్యాయ సేవ సలహా కేంద్రాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ శశిధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమనగల్ లో ఉన్న రైతు వేదిక నందు వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ రైతు న్యాయ సలహా కేంద్రాల ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వ్యవసాయ శాఖ న్యాయశాఖ రెవెన్యూ శాఖలు సంయుక్తంగా రైతులకు న్యాయం జరిగేలా చేయడమే ఈ వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రైతుల భూ వివాదాలు ఇతర న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్యారా లీగల్ వాలంటీర్లను బాల్ రెడ్డి నియమించినట్టు న్యాయమూర్తి తెలిపారు. రైతులు... ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా నకిలీ మందులు విక్రయించినా, ఏ విధంగా మోసం చేసినా న్యాయ సలహా కేంద్రంలో ఫిర్యాదు చేయొచ్చు అని అలాగే వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఎటువంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తినా వాటిని ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని కోరారు. వ్యవసాయ న్యాయ సేవ సలహా కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలని న్యాయమూర్తి పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ గీత, అగ్రికల్చరల్ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వరం, సుజాత, ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీ ఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ వసంత పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ గుప్తా, ఎంపీపీ అనిత విజయ్ డిప్యూటీ తాసిల్దార్ వినోద్ కుమార్ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అరుణ కుమారి, అగ్రికల్చర్ ఆఫీసర్ రాణి శివతేజ, సాయిరాం, మీనాక్షి ఆమనగల్ ఎస్సై బలరాం నాయక్ ఆమనగల్ రైతులు పాల్గొన్నారు.

## గొంగిడి సునీతను కలిసిన కూరేళ్ల

**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కూరెళ్ళ గ్రామానికి చెందిన బిఆర్ఎస్వీ మండల కార్యదర్శి కూరేళ్ల మణికుమార్ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆలేరు మాజీ ప్రభుత్వ విప్ తాజా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె కేక్ కట్ చేయించి వారికి బర్త్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం) మండల బిఆర్ఎస్వీ ఉపాధ్యక్షులు ఏనూతుల వంశీకృష్ణ, సంజు మరియు వలందాస్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు



## మెట్పల్లి ఎంపీపీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం




**విశ్వంభర, మెట్పల్లి:** కోరుట్ల నియోజకవర్గం, మెట్పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులు, ఎంపీటీసీలు, ఎంపీపీ మారు సాయి రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరగగా, ముఖ్య అతిథిగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు. జూన్ 12వ తేదీ వరకు రైతులకు 321 మెట్రిక్ టన్నుల డిఏపి, పచ్చిరొట్ట విత్తనాలు 950 క్వింటాళ్లు, జనుము 166 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతుబంధు, రైతు భరోసా కింద 17,396 రైతులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. రైతు బీమా కింద 2023,2024 సంవత్సరం పాలసీలో భాగంగా 35 మంది రైతులకు ఒక కోటి 75 లక్షలు నామినీలపై బ్యాంకులో జమ చేసినట్లు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో ఎస్ డి ఎఫ్ గ్రాంట్ కు 18 ప్రతిపాదనలకు 28 లక్షలు ఎంపీ ఎల్ ఏ డిఎస్ గ్రాండ్ 5 ప్రతిపాదనలకు 10 లక్షలు కేటాయించడం జరిగిందని అన్నారు. విద్యాశాఖ మన ఊరి మనబడి కార్యక్రమం ద్వారా మెట్పల్లి లోని శివాజీ నగర్ ఎంపీపీ ఎస్, డిడి నగర్ పాఠశాలలు ఓపెనింగ్ సిద్ధంగా ఉన్నాయని అన్నారు. మెట్పల్లి మండల బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యూనిట్ అండ్ బ్యాంక్ వైస్ అప్లికేషన్లు వచ్చాయని, ఎస్సీ కార్పొరేషన్ 14 , ఎస్టీ కార్పొరేషన్ రెండు, దళిత బంధు 24, మైనారిటీ ఆరు వికలాంగులకు ఒకటి చొప్పున మంజూరయ్యాయని మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ తెలిపారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో స్వల్ప భూకంపం

- రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.0 గా నమోదు
- ఇళ్లలోనుంచి పరుగులు తీసిన జనం
- తప్పిన ప్రాణ, ఆస్తి నష్టం

**విశ్వంభర, హిమాచల్ ప్రదేశ్:** ఉత్తర భారతాన్ని వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. అక్కడి కులు ప్రాంతంలో ఇవాళ (శుక్రవారం) ఉదయం 3:39 గంటలకు భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లలో నుంచి జనం బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అక్కడి అధికారులు తెలిపారు. ఇదివరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఏప్రిల్ 24వ తేదీన రాత్రి సమయంలో భూకంపం సంభవించింది. చంబా పట్టణంతో పాటు 100 కిలోమీటర్ల దూరంలోని మనాలీలోనూ భూప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైటనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ అధికారులు వెల్లడించారు. 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు పేర్కొన్నారు. పంజాబ్, హర్యానాలోని పలు ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి.

## పెద్దపల్లిలో దారుణం

- ఆరేళ్ల బాలికపై లైంగికదాడి, హత్య
- చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి ఘాతుకం
- సీసీఫుటేజీ ఆధారంగా నిందితున్ని పట్టుకున్న పోలీసులు

**విశ్వంభర, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఓ కామాంధుడు ఆరేళ్ల బాలికను ఎత్తుకెళ్లి లైంగికదాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లిలోని సుల్తానాబాద్ మండల పరిధిలోని ఓ రైస్‌మిల్లులో గురువారం రాత్రి తల్లితో పాటు నిద్రిస్తున్న ఆరేళ్ల బాలికను అదే మిల్లులో పనిచేస్తున్న డ్రైవర్ బలరాం ఎత్తుకెళ్లాడు. సమీప చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడి అనంతరం బాలికను చంపేశాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అర్ధరాత్రి లేచి చూసేసరికి బాలిక కనపడకపోవడంతో గమనించిన తల్లి తోటి కార్మికులకు ఈ విషయాన్ని తెలిపింది. పోలీసులు అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉగ్రవాదులను ఏరిపారేయండి

- అజిత్ దోవల్‌కు ప్రధాని మోడీ ఆదేశాలు
- హోంశాఖ మంత్రితో చర్చలు
- ఆయుధాలు, సైనికులను తరలించాలని ఆదేశం



**విశ్వంభర, జమ్మూ కాశ్మీర్:** జమ్మూకాశ్మీర్‌లో జరుగుతున్న ఉగ్రదాడులపై ప్రధాని నరేంద్ర మోడీ ఆరా తీశారు. అసలు అక్కడ భద్రతా బలగాలు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయనే విషయంపై ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై భేటీ నిర్వహించారు. జమ్మూ కాశ్మీర్ లో గత నాలుగు రోజులుగా దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. మొదటి రోజు ఓ బస్సు మీద దాడి చేయగా.. ఏకంగా 9 మంది చనిపోయారు. ఇప్పటికే ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఇంకా దాడులు జరుగుతూనే ఉండటంతో మోడీ శుక్రవారం అజిత్ తో సమావేశం నిర్వహించారు. అవసరం అయితే ఈ దాడులను ఆపేందుకు పూర్తి స్థాయిలో సాయుధ బలగాలను అక్కడ మోహరించాలని చెప్పారు. ఆయుధాలు, సైనికుల విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని.. దాడులను ఆపడమే లక్ష్యంగా ముందుకు సాగాలని.. పూర్తి స్థాయిలో అక్కడ ఉగ్రవాదులను ఏరిపారేయాలంటూ ఆదేశించారు నరేంద్ర మోడీ. దీనిపైనే మోడీ అమిత్ షాతో కూడా మాట్లాడారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ ప్రధాని మోదీ మాట్లాడారు. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే దానిపై సమాచారం తెలుసుకున్నారు ప్రధాని నరేంద్ర మోడీ.

# జమ్ము కశ్మీర్ స్కూల్స్‌లో జాతీయ గీతం

- ప్రతి రోజూ గీతాన్ని ఆలపించాల్సిందే
- పాఠశాలలకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సర్క్యులర్ జారీ



**విశ్వంభర, శ్రీనగర్:** జమ్ముకాశ్మీర్ పాఠశాలల్లో ఇకపై తప్పనిసరిగా జాతీయ గీతాన్ని ఆలపించాల్సిందిగా కేంద్రం గురువారం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. జమ్ముకాశ్మీర్‌లోని పాఠశాలలు ఉదయం సమావేశాలను ప్రామాణిక ప్రోటోకాల్‌కు అనుగుణంగా జాతీయ గీతంతో ప్రారంభించాలని ఆదేశించారు. ఉదయం సమావేశాలు విద్యార్థుల్లో నైతిక సమర్థత, భాగస్వామ్య సమాజం, మానసిక ప్రశాంతతను పెంపొందించడానికి వేదికలుగా పనిచేస్తాయి. అయితే కేంద్రపాలిత ప్రాంతంలోని పాఠశాలల్లో ఇటువంటి ముఖ్యమైన ఆచారం సాంప్రదాయం ఏకరీతిగా కొనసాగించడం లేదని గుర్తించాము" అని జమ్ముకాశ్మీర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించే పాఠశాల విద్యా శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. నూతన మార్గదర్శకాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం పాఠశాలల్లో తప్పనిసరిగా జాతీయ గీతాన్ని ఆలపించాలని స్పష్టం చేసింది. పాఠశాల రోజును సానుకూల కార్యక్రమంతో ప్రారంభించేందుకు మరియు విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణను పెంపొందించడానికి ఉదయం సమావేశాలను విద్యావ్యవస్థ అందించిన అమూల్యమైన ఆచారంగా గుర్తించినట్లు తెలిపింది. 8,966 ప్రాథమిక పాఠశాలలు, 7,228 అప్పర్ ప్రైమరీ, 1,741 ఉన్నత పాఠశాలలు, 788 ఉన్నత సెకండరీ పాఠశాలలతో కలిపి జమ్ముకాశ్మీర్‌లో మొత్తంగా 18,723 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.






# నటి శిల్పాశెట్టిపై చీటింగ్ కేసు

- గోల్డ్ స్కీమ్ పేరుతో మోసగించారని ఆరోపణ
- శిల్పా, ఆమె భర్తపై కేసు నమోదుకు కోర్టు ఆదేశాలు

**విశ్వంభర, ముంబై:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శిల్పాశెట్టిపై చీటింగ్ కేసు నమోదైంది. గోల్డ్ స్కీమ్ పేరుతో తనను మోసగించారని ఓ వ్యాపారి కోర్టులో ఫిర్యాదు చేశాడు. సత్యయుగ్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్స్ శిల్పా, రాజ్‌కుంద్రాతోపాటు ఆ సంస్థ డైరెక్టర్లు, మరో ఉద్యోగి మోసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విచారణ చేపట్టిన ముంబై అదనపు సెషన్స్ కోర్టు శిల్పా శెట్టితో పాటు ఆమె భర్త రాజ్‌కుంద్రాపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను జడ్జికి చూపడంతో కేసు నమోదుకు ఆదేశించారు. 2014లో రాజ్ కుంద్రా, శిల్పా శెట్టిలకు చెందిన సత్యయుగ్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ఐదేళ్లకు సంబంధించిన ఓ గోల్డ్ స్కీమ్ ప్రకటించింది. అందులో భాగంగా రూ.18.58 లక్షలకు తాను కిలో బంగారం కొనుగోలు చేశానని సదరు వ్యక్తి పోలీసులకు వివరించారు. దీనికి ఆధారంగా తనకు ఒక గోల్డ్ కార్డ్ కూడా ఇచ్చారని అతడు ఆరోపించాడు. సదరు జోషి టర్మ్ ప్లాన్ 2019 మార్చి 25న ముగిసినప్పటికీ వారు చెప్పినట్లు బంగారం ఇస్తానని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.



# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మళ్లీ నిరాశ

- బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా
- జూన్ 19 విచారణ చేపడతామన్న ఢిల్లీ కోర్టు

**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం కేజ్రీవాల్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. ఈ కేసులో తనకు బెయిల్ కావాలంటూ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. వీడియో కాల్ ద్వారా తన భార్య సమక్షంలో తనకు మెడికల్ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయమూర్తిని కేజ్రీవాల్ తరఫున లాయర్లు కోరారు. కాగా కేజ్రీవాల్ కోరిన దానిపై సమాధానం ఇవ్వాలని తీహార్ జైలు అధికారులను కోరింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ పై విచారణను మరోసారి వాయిదా వేసింది. ఈ నెల 19కి తదుపరి విచారణ చేపడుతామని తెలిపింది. కాగా జులై 19న కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ ముగియనుంది.

**ఎన్నికల అనంతరం మళ్లీ జైలుకు**

లోక్ సభ ఎన్నికల అనంతరం తీహార్ జైల్లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ లొంగిపోయారు. ఇటీవల లోక్ సభ ఎన్నికలకు ప్రచారం చేసుకునేందుకు సుప్రీంకోర్టు కేజ్రీవాల్ కు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. జూన్ 2తో మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో తిరిగి జైలుకు వెళ్లారు. కాగా అనారోగ్యం కారణంగా తనను ఇచ్చిన మధ్యంతర బెయిల్ ను వారం రోజుల పాటు పొడిగించాలని సుప్రీం కోర్టులో సీఎం కేజ్రీవాల్ పిటిషన్ వేయగా.. ఆ పిటిషన్ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

# వాయనాడ్‌కు రాహుల్ బై..బై?

- రాయ్‌బారేలీ స్థానామే కాన్ఫామ్
- ఉప ఎన్నికలో ప్రియాంక పోటీ చేస్తారని ప్రచారం
- ఆమెనే కరెక్ట్ అంటున్న ఏఐసీసీ నేతలు
- ఆసక్తికరంగా వాయనాడ్, రాయ్‌బారేలీ మ్యాటర్



**విశ్వంభర, ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోటలైన అమేథి లేదా రాయ్‌బరేలీ నుంచి ఆమెకు టికెట్ ఇస్తారనే ప్రచారం జోరుగా జరిగింది. అయితే చివరికి ఆమె అసలు పోటీకే దూరంగా ఉన్నారు. తాజాగా ప్రియాంకా వయనాడ్ నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరుగుతున్నది. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె సోదరుడు రాహుల్ గాంధీ.. వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఏదో ఒక స్థానం నుంచి మాత్రమే ఆయన కొనసాగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాహుల్ తన సోదరి కోసం వయనాడ్ స్థానానికి రాజీనామా చేయనున్నారని, దీంతో అక్కడ జరిగే ఉపఎన్నికలో ప్రియాంక పోటీ చేస్తారని తెలిసింది.

**వయనాడ్ వదిలిపెడుతారని చర్చ**

తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తన తల్లి సోనియా గాంధీ ఇన్నాళ్లూ ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలి నుంచి పోటీచేస్తారని అంతా అనుకున్నారు. కానీ అక్కడ రాహుల్ పోటీచేసి విజయం సాధించారు. అయితే కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్.. వయనాడ్‌ను అట్టిపెట్టుకుని రాయ్‌బరేలి స్థానానికి రాజీనామా చేస్తారనే ప్రచారమూ జరిగింది. అయితే ఇప్పుడు వయనాడ్ ఆయన వదిలిపెడతారని చర్చ జరుగుతున్నది. 2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంక.. అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధాని మోడీపై పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అమెకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో అదంతా ఒట్టి ప్రచారమేనని తేలిపోయింది. తర్వాత 2022 లో జరిగిన ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార బాధ్యతలను తన భుజాలపై వేసుకున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తానే ముఖ్యమంత్రి అభ్యర్థినంటూ పేర్కొన్నారు కూడా. కానీ, తర్వాత ఆ మాటలను వెనక్కి తీసుకున్న ఆమె.. ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించారు.

**ప్రియాంక పోటీపై సర్వత్రా ఆసక్తి**

ఇక వయనాడ్‌ను వదులుకునేందుకు రాహుల్ సిద్ధం అయ్యారని, కానీ వేరొకరికి ఛాన్స్ ఇవ్వకుండా తన సోదరి ప్రియాంకను అక్కడి నుండి ఉప ఎన్నికలో నిలబెట్టే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాలంటున్నాయి. రాహుల్ వయనాడ్‌ను వదులుకుంటారని కేరళ కాంగ్రెస్ ఎప్పుడో ఫిక్స్ అయ్యింది. కానీ ప్రియాంక గాంధీ పోటీ చేస్తారన్న సమాచారం వారికి లేదు. ఒక స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేస్తే ప్రియాంక గాంధీ పోటీ చేస్తారా లేదా అనేది గమనించాలి.




# పల్లా శ్రీనివాస్‌కు 'టీడీపీ పగ్గాలు'

- టీడీపీకి కొత్త బాస్‌ను నియమించిన పార్టీ అధినేత
- భారీ మెజార్టీతో అమర్నాథ్‌పై విజయం
- ఉద్యమ నాయకత్వం కీలక పాత్ర
- బీసీలకు టీడీపీ పెద్దపీట



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ కొట్టిన తర్వాత.. ఓవైపు ప్రభుత్వ ఏర్పాటు.. మరోవైపు పార్టీని చక్కదిద్దే పనిలో పడిపోయారు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఈ నేపథ్యంలో ఏపీ టీడీపీకి కొత్త బాస్‌ను నియమించారు చంద్రబాబు.. ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను నియమించారు. సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగిన శ్రీనివాస్ యాదవ్ తిరుగులేని విజయాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాస్ యాదవ్ రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకోనున్నారు.

**బీసీలకు చంద్రబాబు పెద్దపీట**

ఇక, యాదవ సామాజిక వర్గానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేస్తున్నట్టుగా తెలుస్తోంది. తన మంత్రివర్గంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికి చోటు కల్పించిన ఆయన.. టీడీపీ అధ్యక్ష బాధ్యతలను కూడా యాదవ వర్గం చేతిలోనే పెట్టారు. దీంతో యాదవ సామాజిక వర్గానికి మరింత దగ్గరయ్యేలా చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టుగా తెలుస్తోంది. కాగా, సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక నుంచి 95 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై విజయం సాధించారు పల్లా శ్రీనివాస్ యాదవ్. ఆయన తండ్రి కూడా టీడీపీ పార్టీలో పనిచేశారు.. కానీ, పల్లా శ్రీనివాస్ యాదవ్ 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి విశాఖ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత టీడీపీలో చేరి 2014లో గాజువాక ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అంటే. 2019 ఎన్నికల్లో పరాజయాన్ని చవిచూశారు.. ఆ తర్వాత జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడమే కాకుండా, నియోజకవర్గంపై మరింత కేంద్రీకరించి పనిచేశారు. ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఇక, ఇప్పుడు రాష్ట్రంలో టీడీపీజనసేనబీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సమయంలో పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు ఏపీ టీడీపీ పగ్గాలు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అప్పచెప్పారు.

# బాబుకు కేంద్రంలో చక్రం తిప్పే చాన్స్

## ఏపీపై ఆధారపడ్డ ఎన్డీఏ సర్కార్ : ఉండవల్లి అరుణ్



**విశ్వంభర, విజయవాడ:** ఉండవల్లి అరుణ్ కుమార్ తాజాగా చంద్రబాబు మీద సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. అంతే కాకుండా చంద్రబాబుకు ఇప్పుడు కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం వచ్చిందని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఫలితాల మీద ఆధారపడి కేంద్రంలో ఎన్డీయే సర్కార్ వచ్చిందని చెప్పారు. ఒకవేళ చంద్రబాబుతో పొత్తులు లేకుంటే మాత్రం ఎన్డీయే అధికారంలోకి రాకపోయేది. కాబట్టి ఇలాంటి సమయంలోనే రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, రైల్వే జోన్ ఏర్పాటు లాంటివి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక పదకొండు మంది ఎమ్మెల్యేలను గెలిచిన వైసీపీ.. అసెంబ్లీకి వెళ్లి పోరాడాలని చెప్పారు. ఏపీలో మద్యం ధరల పెరుగుదలతోనే వైసీపీ ప్రభుత్వం ఓడిపోయిందని జోస్యం చెప్పారు. జగన్ ఇప్పటికైనా తన కార్యకర్తలతో కలిసి వారి సమస్యలపై చర్చించాలని సూచించారు ఉండవల్లి అరుణ్ కుమార్.

## ఆ శాఖలు ఇచ్చినందుకు సీఎంకు ధన్యవాదాలు: నారా లోకేష్



**విశ్వంభర, మంగళగిరి:** ఏపీ మంత్రులకు చంద్రబాబు శాఖలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంత్రి నారా లోకేష్ కు కూడా కీలక శాఖలను అప్పగించారు చంద్రబాబు నాయుడు. ఆయనకు హెచ్‌ఆర్‌డి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజి శాఖలను అప్పగించారు సీఎం. ఈ సందర్భంగా నారా లోకేష్ స్పెషల్ థాంక్స్ చెబుతూ ఇలా రాసుకొచ్చారు. హెచ్‌ఆర్‌డి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజి శాఖల మంత్రి గా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడి గారికి ధన్యవాదాలు. నాడు పల్లె సేవే పరమాత్ముడి సేవ అని భావించి పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామాల రూపురేఖలు మార్చాను. ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా అనేక కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాను. గత అనుభవం నేర్పిన పాఠాలతో ఇప్పుడు మరింత సమర్ధవంతంగా పనిచేస్తాను. యువగళం పాదయాత్రలో కేజీ నుండి పీజీ వరకూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తానని హామీ ఇచ్చాను. స్టాన్‌ఫోర్డ్ లో చదువుకున్న నాకు గ్రామీణ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాన్ని ఒక పవిత్రమైన బాధ్యతగా స్వీకరిస్తున్నాను. రాష్ట్రానికి ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు తీసుకొచ్చి పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తాను అంటూ ఆయన రాసుకొచ్చారు.

## నన్ను అవమానించిన డీజీపీ ఆఫీసుకు కచ్చితంగా వెళ్తా: హోం మంత్రి అనిత

**విశ్వంభర, అమరావతి:** తనను అవమానించిన డీజీపీ ఆఫీసుకు కచ్చితంగా వెళ్తానని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ మహిళగా తనకు ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని చెప్పారు. సోషల్ మీడియాలో తనను అనేక రకాలుగా, తన మనసు గాయపడేలా అవమానపరిచినప్పటికీ అవన్నీ తట్టుకొని నిలబడగలిగానని తెలిపారు. ఏపీలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతామని వంగలపూడి అనిత చెప్పారు. ఎవరికి అన్యాయం జరిగినా ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసే విధంగా తమ పాలన ఉంటుందని తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి, చంద్రబాబు నివాసంపై దాడి కేసులను పునర్విచారణ చేయిస్తామని చెప్పారు. దళిత వర్గానికి చెందిన తనకు సీఎం చంద్రబాబు హోం మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని వంగలపూడి అనిత తెలిపారు. తనకు హోం మంత్రి పదవి ఇచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. చంద్రబాబు అప్పగించిన గురుతర బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఎలాంటి పక్షపాతం లేకుండా నిస్పక్షపాతంగా వ్యవహరిస్తానని అన్నారు.

# టీచర్ టూ... హోమ్ మినిస్టర్..!



**విశ్వంభర, విశాఖపట్నం :** పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితను హోం మంత్రి పదవి వరించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ మహిళలకే హోం మంత్రి పదవి దక్కగా.. చంద్రబాబు కూడా ఆ పదవిలో మహిళనే నియమించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఈ మంత్రివర్గంలో పదవి దక్కించుకున్న ఏకైక ఎమ్మెల్యే వంగలపూడి అనిత. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంతో మంది సీనియర్ నేతలు ఉన్నప్పటికీ.. పార్టీ పట్ల ఆమె చూపిన విధేయతకు మంత్రి పదవిని కేటాయించిన చంద్రబాబు.. ఈసారి ఏకంగా హోం మంత్రిని చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ పాయకరావుపేట నుంచి మరోసారి అనితకు అవకాశం ఇచ్చింది. అధినేత నమ్మకాన్ని నిలబెడుతూ రికార్డు విక్టరీ కొట్టారు వంగలపూడి అనిత. స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులను కలుపుకుని వెళ్లి 2024 ఎన్నికల్లో పాయకరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి 43,727 ఓట్ల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించారు.

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు దక్కించుకోవటమే కాకుండా.. హోం మంత్రిగా నియమితులయ్యారు. ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. 2014కు ముందు టీడీపీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన అనిత... 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2014 నుంచి 2019 వరకు పాయకరావుపేట ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు.

2019 ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం ఆమెను.. పాయకరావుపేట నుంచి కొవ్వూరుకు పంపింది. అయితే 2019 ఎన్నికల్లో ఓడిపోయినా కూడా టీడీపీ కోసం వంగలపూడి అనిత పనిచేశారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేస్తూ వైసీపీ విధానాలను ఎండగడుతూ వచ్చారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్నా ఆమె వెనక్కి తగ్గలేదు.

# కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆరుగురు వ్యక్తులు మృతి
- మరో నలుగురికి గాయాలు



విశ్వంభర, కృష్ణా జిల్లా: రోడ్డు ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన కృష్ణా జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద హైవేపై రెండు లారీలు ఢీకొన్నాయి. కృష్ణా జిల్లా బంటుమిల్లి వైపు నుంచి రొయ్యల లోడ్‌తో వస్తున్న లారీని, పుదుచ్చేరి నుంచి భీమవరం వైపు వెళ్తున్న మరో లారీ ఢీకొంది. కట్టెల లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో లారీల డ్రైవర్లతో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు వదిలారు. మృతుల్లో ఐదుగురిని పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లరేవు వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో కృష్ణా జిల్లా బంటుమిల్లి వైపు వెళ్తున్న లారీలో డ్రైవర్‌తో పాటు 10 మంది ప్రయాణికులున్నారు. మరో లారీలో డ్రైవర్‌తో పాటు ఓ ప్రయాణికుడున్నారు. ఘటనాస్థలంలో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 4గంటలకు ప్రమాదం జరగగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## స్పీకర్ పదవిపై రఘురామ కృష్ణరాజు కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, తిరుపతి:** స్పీకర్ పదవిపై రఘురామ కృష్ణ రాజు స్పందించారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలో ఓ రెస్టారెంట్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ఇవాళ ప్రారంభమైన జీ7 రెస్టారెంట్ లో నా పేరిట పెట్టిన ఆర్‌ఆర్‌ఆర్ ఇడ్లీని ప్రారంభించానని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తరువాత ఘన విజయం సాధించాం. ఎమ్మెల్సీ వ్యవస్థ వద్దు, శాసన మండలిని రద్దు చేస్తానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి నేడు శాసనసభే కావాల్సి వచ్చింది. ఎమ్మెల్సీ వ్యవస్థను రద్దు చేయాలని చంద్రబాబు అనుకోరని రఘురామ కృష్ణరాజు అన్నారు. మంత్రి పదవి దక్కకపోవటంపైనా, స్పీకర్ పదవి వస్తుందన్న ప్రచారంపై ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పదవే కాదు.. ఏదైనా స్వీకరిస్తాను. ఇవ్వకపోయినా నాకు ఉన్న బాధ్యత నిర్వర్తిస్తానని రఘురామ కృష్ణరాజు చెప్పారు. నేను ఇచ్చిన ఫిర్యాదుపై మరో రెండు రోజులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. లేకపోతే ఏమి చేయాలో చేస్తానని అన్నారు.

## జగన్ ఓడిపోయాడంతే.. చావలేదు అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రస్తుతం పరిపాలనపై దృష్టి కేంద్రీకరిస్తూనే వైసీపీని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ ఓడిపోయాడు కానీ చావలేదని.. చచ్చేవరకూ కొట్టాలని టీడీపీ నేతలతో ఆయన సంభాషించడం చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో "వైఎస్ జగన్‌కు అపారమైన జన, కుల బలం ఉంది. తెలంగాణ ప్రభుత్వంలో చాలా మంది అతనికి క్లోజ్‌గా ఉండే వారు.. చెప్పింది కరెక్ట్‌గా రిసీవ్ చేసుకోండి.." అంటూ అయ్యన్న పాత్రుడు అన్నారు. ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇదిలా ఉండగా నాగబాబు కూడా వైసీపీపై విమర్శలు గుప్పించారు. "వైసీపీ కోరల్లో విషం మిగిలే ఉంది.. కూటమిపై విషప్రచారం చేసేవాళ్లను వదలం.. బీ కేర్‌ఫుల్.." అంటూ నాగబాబు హెచ్చరించారు.

# ఢిల్లీలో మా మద్దతు వాళ్లకే తేల్చి చెప్పేసిన జగన్..



**విశ్వంభర, విజయవాడ:** ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జగన్ వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. పార్టీ నేతలు, ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఇప్పటికే సమీక్ష నిర్వహించిన జగన్.. భవిష్యత్ కార్యక్రమాలపై వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇక తాజాగా ఎంపీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కొన్ని ప్రకటనలు, సూచనలు చేశారు. ఢిల్లీలో ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది లేదని.. ప్రజాహితమే ధ్యేయంగా.. ప్రజలకే మద్దతు తెలపాలని సూచించారు. అంతే కాకుండా గెలుపు, ఓటములను పక్కన పెట్టి పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడాలని తెలిపారు. ప్రస్తుతం మనకు పార్లమెంట్ లో 11 మంది రాజ్యసభ సభ్యులు, 4గురు లోక్‌సభ సభ్యులు ఉన్నారని.. మొత్తంగా 15 మంది ఎంపీలు మన పార్టీకి ఉన్నారని తెలిపారు. కాబట్టి మన పార్టీ కూడా బలమైనదే అని ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు రావొద్దని.. బలంగా పోరాడితే మళ్లీ మనదే అధికారం అని ఆయన వివరించారు. ఐదేళ్లు ఇట్టే గడిచిపోతాయని.. కాబట్టి ఈ ఐదేండ్లు ప్రజల్లో ఉండి పోరాడితే కచ్చితంగా పాత రోజులు వస్తయాని స్పష్టం చేశారు సీఎం జగన్. ఈ సందర్భంగా ఎంపీలకు కొన్ని సూచనలు చేశారు. ఇదివరకు లాగానే రాజ్యసభలో పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి కొనసాగుతారని, లోక్‌సభలో పార్టీ నాయకుడిగా మిథున్ రెడ్డి, పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వై.వి.సుబ్బారెడ్డి ఉంటారని తెలిపారు జగన్.

## అలా ఓడిపోతే సిగ్గుపడాలా.. తలెత్తుకుని తిరుగుదాం : రోజా ట్వీట్

**విశ్వంభర, నగరి:** మొన్నటి ఎన్నికల్లో వైసీపీ ఘోరాతిఘోరంగా ఓడిపోయింది. అప్పటి నుంచి మాజీ మంత్రులు ఎవరూ పెద్దగా బయటకు రావట్లేదు. ఎందుకంటే మాజీ మంత్రుల్లో ఒక్క పెద్దిరెడ్డి తప్ప అందరూ ఓడిపోయారు. అలా ఓడిపోయిన వారిలో మాజీ మంత్రి రోజా కూడా ఉన్నారు. ఆమె కూడా నగరిలో గాలి భాను చేతిలో ఘోరంగా ఓడిపోయారు. అప్పటి నుంచి ఆమె సోషల్ మీడియాలో ఏదో ఒక పోస్టు పెడుతూ యాక్టివ్ గా కనిపిస్తోంది. ఇదే క్రమంలో శుక్రవారం ఆమె మరో పోస్టు కూడా పెట్టారు. చెడు చేసి ఓడిపోతే సిగ్గుపడాల! కానీ.. మంచి చేసి ఓడి పోయాం! గౌరవంగా తలెత్తుకు తిరుగుదాం! ప్రజల గొంతుకై ప్రతిధ్వనిద్దాం అంటూ ఆమె ట్విట్టర్ లో ఓ పోస్టు పెట్టారు. దాంతో అది కాస్తా వైరల్ అవుతోంది. అయితే ఇక్కడ మరో విషయం కూడా ఉందండోయ్.. దీనికి ఆమె కామెంట్ సెక్షన్ ను ఆఫ్ చేశారు. కామెంట్లు చేస్తే తనకు వ్యతిరేకంగానే వస్తున్నాయని ఆమె గ్రహించారు కాబోలు. అందుకే ఇలా ఆఫ్ చేసుకున్నారు. గతంలో జగన్ ప్రభుత్వంలో ఆమె పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు. కాగా చంద్రబాబు నాయుడు మీద వ్యక్తిగత విమర్శలు చేయడం వల్లే వైసీపీ మంత్రులందరూ ఓడిపోయారని టాక్ నడుస్తోంది.



# చిట్టీల పేరుతో ఘరానా మోసం

- శ్రీకాకుళం జిల్లా కుంటిభద్ర గ్రామంలో వెలుగుచూసిన వైనం
- 31 మందికి దాదాపు రూ.కోటికి పైగా కుచ్చు టోపీ
- 16 నెలల క్రితం నుంచి జరుగుతున్నా బైట పడని వైనం
- అడిగితే చంపండని బెదిరిస్తున్న నయవంచకుడు







విశ్వంభర, శ్రీకాకుళం: పై ఫొటో లో ఉన్న వ్యక్తి పేరు గులివిందల మాధవ రావు తండ్రి బుచ్చిబాబు. ఈయనది కొత్తూరు మండలం, కుంటిభద్ర గ్రామం. సుమారు 50 మంది హైదరాబాద్, మూసాపేట్ లో బతుకుతున్న వలస కుటుంబాలను చిట్టీల పేరు తో డబ్బు కట్టించుకొని కోటి రూపాయల వరకు ఒకరికి తెలియకుండా ఒకరిని మోసం చేశాడు. రూపాయి రూపాయి పోగేసి దాచుకున్న సొమ్మును, అయినవాళ్లు, స్నేహితులను మంచిమాటలతో నయవంచన చేసి డబ్బు మొత్తం జమ చేసుకొని సొంత ఊరికి ఉడాయించాడు. మోసపోయిన వారిలో కొందరు మాధవ రావు ఊరికి వెళ్లి పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. నేటికీ 14 నెలలు పూర్తయినా ఎటువంటి ఉపయోగం లేదు. పోలీస్ కేసు, కోర్టు చుట్టూ తిరిగే పరిస్థితి లేక కొత్తూరులో ఒక పెద్ద మనిషి దగ్గరకు వెళ్ళి.. ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేసినా న్యాయం జరగలేదు. వారికే కాదు సొంత ఊర్లో కూడా సుమారు రూ.20 లక్షల వరకు ఎగనామం పెట్టి దర్జాగా ఐపీ పెట్టి తిరుగుతున్నాడు. పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులు సరిదిద్దాల్సింది పోయి,వాడితో చేతులు కలిపి అతని కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములుగా చేరారు. ఎవరైనా వెళ్లి అడిగితే తన దగ్గర ఏమి లేదు.. సంపేస్తే సంపేయండని తిరిగి బెదిరిస్తున్నాడని బాధితులు వాపోతున్నారు.

## హాకీ ఇండియా లీగ్‌కు ఆహ్వానం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ప్రతిష్ఠాత్మక హాకీ ఇండియా లీగ్ మళ్లీ వస్తోంది. ఎనిమిదేండ్ల నిరీక్షణకు తెర దించుతూ ఈ ఏడాది డిసెంబర్‌లో మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలోనే హాకీ ఇండియా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆరంభించింది. ఈ మెగా లీగ్‌లో పాల్గొనేందుకు ఉత్సాహంగా ఉన్న జట్లు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.అంతేకాదు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది కోసం ప్రత్యేక అప్లికేషన్ ఫామ్‌ను అందుబాటులో ఉంచింది. దరఖాస్తులు స్వీకరించేందుకు జూన్ 30 ఆఖరి తేదీ అని హాకీ ఇండియా వెల్లడించింది. 'ఇదొక గొప్ప ముందడుగు. హాకీ ఇండియా లీగ్ పునః ప్రారంభానికి మరింత చేరువయ్యాం. ఈ లీగ్‌ను హాకీ ఆటగాళ్లు, అభిమానులు ఎంతగానో ఇష్టపడతారు. భారత ఆటగాళ్లకు ప్రపంచంలోని హాకీ స్టార్లతో పోటీ పడేందుకు ఇదొక చక్కని అవకాశం' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలిప్ టర్కీ అన్నాడు. భారత గడ్డపై 2017లో చివరిసారిగా హాకీ ఇండియా లీగ్ జరిగింది. ఆ తర్వాత మెగా టోర్నీ నిర్వహణ కుదరలేదు. అయితే గత సంవత్సరం హాకీ ఇండియా లీగ్ టోర్నీ ఈ ఏడాది డిసెంబర్ - వచ్చే ఏడాది ఫిబ్రవరి మధ్య హాకీ ఇండియా లీగ్ షురూ కానుంది. ఈ మెగా టోర్నీలో ప్రపంచ స్థాయి జట్లు పోటీ పడనున్నాయి. మొత్తంగా పురుషుల విభాగంలో 8 జట్లు, మహిళల విభాగంలో ఆరు జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈసారి టోర్నీకి ఓ ప్రత్యేకత ఉంది. మహిళలకు తొలిసారి అవకాశమిచ్చారు. దాంతో, హాకీ ఇండియా లీగ్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉండనుంది.


# కోహ్లీని ఔట్ చేయడం జీవితంలో మర్చిపోలేను

### సౌరభ్ నేత్రవల్కర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్





**విశ్వంభర, స్పోర్ట్స్ :** బౌలర్ సౌరభ్ నేత్రవల్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. భారత్ తరపున అండర్ 19 క్రికెట్ ఆడిన పేసర్ సౌరభ్ నేత్రవల్కర్ ఇప్పుడు అమెరికాలో ఫేమస్. టీ20 ప్రపంచకప్‌లో యూఎస్ఏ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు పాక్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించాడు. భారత్‌పైనా రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని తొలి బంతికే ఔట్ చేసి ఆశ్చర్యపరిచాడు. మరొక ఓవర్‌లో కెప్టెన్ రోహిత్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. కోహ్లీని గోల్డెన్ డక్ చేయడంపై సౌరభ్ స్పందించాడు. శుక్రవారం ఐర్లాండ్‌తో యూఎస్ఏ గ్రూప్ స్టేజ్‌లో తన చివరి మ్యాచ్ ఆడనుంది. ఈక్రమంలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అతడు మాట్లాడాడు. ''ఇద్దరు స్టార్లను ఔట్ చేయడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. నా సంతోషాన్ని మాటల్లోనూ వర్ణించలేకపోతున్నా. యూఎస్ఏ గత రెండు మ్యాచుల్లో టాప్ జట్లతో తలపడింది. విరాట్ కోహ్లీ వికెట్ తీయడం మాత్రం జీవితంలో మరిచిపోలేను. తొలి బంతికే ఔట్ చేయడం నాకొక భావోద్వేగ క్షణం. ఆఫ్ స్టంప్‌నకు అవతల బంతిని విసిరి ఫలితం రాబడదామని ప్రయత్నించా. అందుకు తగ్గట్టుగానే వికెట్ దక్కడం ఆనందంగా ఉంది. సూర్యకుమార్ యాదవ్ నాకు అండర్ 15 నుంచి తెలుసు. మేమిద్దరం కలిసి ఆడాం. విరాట్ నాకు వ్యక్తిగతంగా తెలియదు. కానీ, మ్యాచ్ అనంతరం నన్ను అభినందించాడు'' అని సౌరభ్ తెలిపాడు.

## మరోసారి తండ్రైన జోస్ బట్లర్




**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ మూడోసారి తండ్రి అయ్యాడు. బట్లర్ భార్య లూయిస్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. బట్లర్‌లూయిస్ దంపతులకు ఇదివరకే పాప, బాబు ఉన్నారు. బట్లర్ దంపతులు తమ మూడో సంతానానికి చార్లీ అని పేరు పెట్టారు. చార్లీ పుట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ చిన్నారి గత నెల (మే) 28వ తేదీనే జన్మించినట్లు తెలుస్తుంది. చార్లీ జన్మించిన విషయాన్ని బట్లర్ దంపతుల గోప్యంగా ఉంచారు. తాజాగా ఈ విషయం సోషల్‌మీడియాలో వైరలవుతుంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం జోస్ బట్లర్ టీ20 ప్రపంచకప్ 2024తో బిజీగా ఉన్నాడు. బట్లర్ సారథ్యం వహిస్తున్న ఇంగ్లండ్ జట్టు గ్రూప్‌బి నుంచి సూపర్ 8 బెర్త్ కోసం స్కాట్లాండ్‌తో పోటీపడుతుంది. గ్రూప్ దశలో ఇంగ్లండ్, స్కాట్లాండ్ మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ప్రస్తుతం స్కాట్లాండ్ ఆడిన 3 మ్యాచ్‌ల్లో 5 పాయింట్లతో గ్రూప్‌బిలో రెండో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ మూడింట ఒక మ్యాచ్ గెలిచి 3 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

## చెస్ చాంపియన్‌గా దివ్య దేశ్ ముఖ్!



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ప్రపంచ జూనియర్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత క్రీడాకారిణి దివ్య దేశ్ ముఖ్ సత్తా చాటింది. టోర్నీలో మొత్తం 11 రౌండ్లలో 10 పాయింట్లు సాధించిన దివ్య.. అగ్రస్థానంలో నిలిచింది. గురువారం చివరాఖరి రౌండులో బెలోస్లావా( బల్గేరియా)ను ఆమె ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. మరో భారత ప్లేయర్ రక్షిత రవి (7.5) మాత్రం కేవలం ఐదవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. చివరి రౌండ్లో మరియమ్ (అర్మేనియా) చేతిలో రక్షిత ఓటమి పాలైంది. మరియమ్ (9.5), అయాన్ (8.5) (అజర్ బైజాన్ ) రెండు , మూడో స్థానాలను దక్కించుకున్నారు. ఓపెన్ విభాగంలో నోజెర్ బెక్ (కజకిస్థాన్ 8.5) పాయింట్లతో టైటిల్ విన్నర్‌గా నిలిచాడు.



## విడాకుల వార్తలపై స్పందించిన హార్థిక్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** గత ఐపీఎల్ సీజన్ సమయంలో హార్థిక్ పాండ్యా పేరు బలంగా వినిపించింది. హార్థిక్ చాలా రోజులుగా అందరి ప్రశంసలు అందుకునేలా ఆడాడు. కానీ ఐపీఎల్ లో ఘోరమైన ఫామ్ తో విమర్శలు మూటగట్టుకున్నాడు. ఆ తర్వాత తన భార్య నటాషాతో విడాకులు అంటూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. భరణం కూడా ఇచ్చాడంటూ రూమర్లు స్ప్రెడ్ అయ్యాయి. అయితే ఆ తర్వాత నటాషా పదిహేను రోజుల క్రితం ఓ పోస్టు చేయడంతో అంతా సద్దుమణిగింది. అయితే ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ లో ఆడుతున్న హార్తిక్ బాగానే ఆడుతున్నాడు. ఈ క్రమంలోనే మొన్న పాకిస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో ఇండియా గెలిచింది. ఈ సందర్భంగా ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్ రికీ పాంటింగ్ భారత ఆటగాళ్లను ప్రశంసించారు. హార్థిక్ తో సరదాగా ముచ్చటించాడు రికీ పాంటింగ్. వారిద్దరి మధ్య సంభాషణ ఇలా సాగింది. హార్దిక్ పాండ్యా: రికీ..! అంతా ఎలా జరుగుతోంది? మీ కుటుంబం ఎలా ఉంది. రికీ పాంటింగ్: వాళ్లంతా కూల్‌గా ఉన్నారు. మీరు ఎలా ఉన్నారు? హార్దిక్ పాండ్యా: అంతా బాగానే ఉంది. ఆల్ స్వీట్ అంటూ చెప్పాడు. అంటే హార్థిక్ మాటలను బట్టి తాను ఇంకా విడాకులు తీసుకోలేదని తెలుస్తోంది. కలిసే ఉన్నారని అంటున్నారు వారి అభిమానులు.

## ధోనీ అంటే చాలా భయం: జడేజా



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్ కప్ 2024 లో టీమిండియా జట్టు అదరగొడుతుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచి సూపర్ 8 బెర్త్ ను ఖరారు చేసుకుంది. ఐర్లాండ్, పాకిస్థాన్, అమెరికాపై వరుసగా నెగ్గిన రోహిత్ సేన.. మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. జూన్ 15 న కెనడాతో ఫ్లోరిడాలో ఈ మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం టీమిండియా క్రికెటర్లు అమెరికాలో ఎంజాయ్ చేస్తూ ఉన్నారు. ఇందులో భాగంగా టీమిండియా ఆల్ రౌండర్లు జడేజా, హార్దిక్ పాండ్యా ఒక ప్రోగ్రామ్ లో యువ అభిమానులతో సందడి చేశారు. స్టార్ స్పోర్ట్స్ తో ముచ్చటించిన మన క్రికెటర్లు కాసేపు సరదాగా గడిపారు. ఎంతో ఫన్నీగా సాగిన ఈ ఇంటర్వ్యూలో రవీంద్ర జడేజా టీమిండియాలో తనకెవరంటే భయమో చెప్పుకొచ్చాడు. ఒక చిన్నపిలాడు.. "నువ్వు చాలా ధైర్యవంతుడివి, నువ్వు ఎవరికీ భయపడలేదా?" అని జడేజాను అడిగాడు. దీనికి జడేజా నవ్వుతూ "నేను ధోనీ భాయ్ చాలా భయపడతాను అని చెప్పుకొచ్చాడు. ధోనీ, జడేజాల మధ్య ఉన్న అనుబంధం ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దశాబ్దానికి పైగా చెన్నై సూపర్ కింగ్స్ తరపున వీరిద్దరూ ప్రాతినిధ్యం వహిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు.



## స్టాక్ మార్కెట్‌లో కనక వర్షం.. కొత్త రికార్డుల్లో సూచీలు

**విశ్వంభర, బిజినెస్ :** స్టాక్ మార్కెట్ లో కనక వర్షం కురుస్తోంది. స్టాక్ మార్కెట్ సూచీలు ఎప్పటికప్పుడు కొత్త కొత్త రికార్డులను నెలకొల్పుతుండటంతో ఇన్వెస్టర్లు కూడా భారీగా లాభాలను పొందుతున్నారు. శుక్రవారం కూడా ఆల్ టైమ్ హై రికార్డ్ దగ్గర స్టాక్ మార్కెట్ ముగిసింది. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 181 పాయింట్లు లాభపడి 76,992 దగ్గర లైఫ్ టైమ్ హై రికార్డ్ దగ్గర ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి నిఫ్టీ 23,465 దగ్గర ఆల్ టైమ్ గరిష్ఠాలను టచ్ చేసింది.కాగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ , మహీంద్రా షేర్లను ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో కొనడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కాగా, ఇవాళ ఆటో, కన్జ్యూమర్ గూడ్స్,బ్యాంక్ స్టాక్ లు భారీగా లాభపడ్డాయి.

**కారణం ఇదే**

శుక్రవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024 మే నెలలో భారత్ సరకుల ఎగుమతులు 9 శాతం పెరిగి 38.13 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది కూడా ఇన్వెస్టర్స్ సెంటిమెంట్‌ను బలపరిచింది. దీంతో శుక్రవారం దేశీయ మార్కెట్లు రికార్డ్ స్థాయిలో లాభపడ్డాయి. ఇదిలా ఉంటే, భారతదేశపు దిగుమతులు కూడా భారీగానే పెరిగాయి. 2023 మే నెలలో 57.48 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంటే 2024 మే నాటికి 61.91 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంది.

# ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వాడుతున్నారా? జులై 1 నుంచి కొత్త రూల్స్..

**విశ్వంభర, బిజినెస్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కార్డ్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన పలు క్రెడిట్ కార్డులకు సంబంధించిన రివార్డుల పాయింట్ల విషయంలో కొత్త రూల్స్ తీసుకొస్తోంది. వచ్చే నెల జులై 1, 2024 నుంచి ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల ద్వారా ప్రభుత్వ ట్రాన్సాక్షన్లపై రివార్డు పాయింట్లను తొలగిస్తున్నట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. అలాగే కొన్ని కార్డులకు కొత్త రూల్స్ జులై 15వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఈ క్రమంలో కొత్త నియమ, నిబంధనలు కచ్చితంగా తెలుసుకోవడం మంచిది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వాడుతున్నవారు, కొత్తగా తీసుకోవాలనుకుంటున్న వారు ఈ కొత్త రూల్స్ గురించి తెలుసుకోవాలి.

**ఏఏ కార్డుల రివార్డ్ పాయింట్లు వర్తించవు..?**

- జులై 1, 2024 నుంచి ప్రభుత్వ సంబంధిత ట్రాన్సాక్షన్లు చేస్తే ఏ క్రెడిట్ కార్డులకు రివార్డ్ పాయింట్లు వర్తించవో తెలుసుకోండి. ఎస్‌బీఐ కార్డు వెబ్‌సైట్ ప్రకారం అందులో 22 క్రెడిట్ కార్డ్స్ ఉన్నాయి.
- ఆరమ్, ఎస్‌బీఐ కార్డ్ ఎలైట్, ఎస్‌బీఐ కార్డు ప్లస్, సింప్లి క్లిక్ ఎస్‌బీఐ కార్డు, సింప్లి క్లిక్ అడ్వాంటేజ్, ఎస్‌బీఐ కార్డు, ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, ఎస్‌బీఐ కార్డు ప్రైమ్ అడ్వాంటేజ్, ఎస్‌బీఐ కార్డు ప్లాటినం
- ఎస్‌బీఐ కార్డు ప్లాటినం అడ్వాంటేజ్, గోల్డ్ ఎస్‌బీఐ కార్డు, గోల్డ్ క్లాసిక్ ఎస్‌బీఐ కార్డు, గోల్డ్ డిఫెన్స్ ఎస్‌బీఐ కార్డు, గోల్డ్ అండ్ మోర్ ఎంప్లాయీస్ ఎస్‌బీఐ కార్డు, గోల్డ్ అండ్ మోర్ అడ్వాంటేజ్ ఎస్‌బీఐ కార్డు,
- గోల్డ్ అండే మోర్ ఎస్‌బీఐ కార్డు, సింప్లి సేవ్ ఎస్‌బీఐ కార్డు, సింప్లి సేవ్ ఎంప్లాయీ ఎస్‌బీఐ కార్డు, సింప్లి సేవ్ అడ్వాంటేజ్ ఎస్‌బీఐ కార్డు, గోల్డ్ అండ్ మోరే టైటానియం ఎస్‌బీఐ కార్డు, సింప్లి సేవ్ ప్రో ఎస్‌బీఐ కార్డు, క్రిషాక్ ఉన్నతి ఎస్‌బీఐ కార్డు, సింప్లి సేవ్ మెర్చంట్ ఎస్‌బీఐ కార్డు, సింప్లి సేవ్ యూపీఐ ఎస్‌బీఐ కార్డు, ఎస్ఐబీ ఎస్‌బీఐ ప్లాటినం కార్డు, ఎస్ఐబీ ఎస్‌బీఐ సింప్లి సేవ్ కార్డు, కేవీబీ ఎస్‌బీఐ ప్లాటినం కార్డు,




- కేవీబీ ఎస్‌బీఐ గోల్డ్ అండ్ మోర్ కార్డు, కేవీబీ ఎస్‌బీఐ సిగ్నేచర్ కార్డు, కర్నాటక బ్యాంక్ ఎస్‌బీఐ ప్లాటినం కార్డు, కర్ణాటక బ్యాంక్ ఎస్‌బీఐ సింప్లి సేవ్ కార్డు, కర్ణాటక బ్యాంక్ ఎస్‌బీఐ ప్రైమ్, అలహాబాద్ బ్యాంక్ ఎస్‌బీఆ కార్డు ఎలైట్, అలహాబాద్ బ్యాంక్ ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, అలహాబాద్ బ్యాంక్ ఎస్‌బీఐ సింప్లి సేవ్ కార్డు, సిటీ యూనియన్ బ్యాంక్ ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, సిటీ యూనియన్ బ్యాంక్ సింప్లి సేవ్ ఎస్‌బీఐ కార్డు
- సెంట్రల్ బ్యాంక్ ఎస్‌బీఐ కార్డు ఎలైట్, సెంట్రల్ బ్యాంక్ ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, సెంట్రల్ బ్యాంక్ సింప్లి సేవ్ ఎస్‌బీఐ కార్డు, యూకో బ్యాంక్ ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, యూకో బ్యాంక్ సింప్లి సేవ్ ఎస్‌బీఐ కార్డు
- యూకో బ్యాంక్ ఎస్‌బీఐ కార్డు ఎలైట్, పీఎస్‌బీ ఎస్‌బీఐ కార్డు ఎలైట్, పీఎస్‌బీ ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, పీఎస్‌బీ ఎస్‌బీఐ సింప్లి సేవ్ కార్డులు ఉన్నాయి.

**జులై 15, 2024 వ తేదీ నుంచి..**

జులై 15, 2024 వ తేదీ నుంచి ప్రభుత్వ ట్రాన్సాక్షన్లకు ఏయే క్రెడిట్ కార్డులకు రివార్డ్ పాయింట్లు వర్తించవో తెలుసుకోండి. ఎయిరిండియా ఎస్‌బీఐ ప్లాటినం కార్డు, ఎయిరిండియా ఎస్‌బీఐ సిగ్నేచర్ కార్డు, సెంట్రల్ ఎస్‌బీఐ సెలెక్ట్ ప్లస్ కార్డు, చెన్నై మెట్రో ఎస్‌బీఐ కార్డు, క్లబ్ విస్తారా ఎస్‌బీఐ కార్డు, క్లబ్ విస్తారా ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, ఢిల్లీ మెట్రో ఎస్‌బీఐ కార్డు, ఎథిహాడ్ గెస్ట్ ఎస్‌బీఐ కార్డు, ఎథిహాడ్ గెస్ట్ ఎస్‌బీఐ ప్రీమియర్ కార్డు, ఫ్యాబ్ ఇండియా ఎస్‌బీఐ కార్డు, ఫ్యాబ్ ఇండియా ఎస్‌బీఐ కార్డు ఎలైట్, ఐఆర్‌సీటీసీ ఎస్‌బీఐ కార్డు, ఐఆర్‌సీటీసీ ఎస్‌బీఐ కార్డు ప్రీమియర్, ముంబై మెట్రో ఎస్‌బీఐ కార్డు, నేచర్ బాస్కెట్ ఎస్‌బీఐ కార్డు, నేచర్ బాస్కెట్ ఎస్‌బీఐ కార్డు ఎలైట్, ఓలా మనీ ఎస్‌బీఐ కార్డు, పేటీఎం ఎస్‌బీఐ కార్డు, పేటీఎం ఎస్‌బీఐ కార్డు సెలెక్ట్, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డు, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డు ప్రైమ్, యాత్రా ఎస్‌బీఐ కార్డు ఉన్నాయి.

## ఐసీఐసీఐ బ్యాంక్ వడ్డీ రేట్లు పెంపు షురూ

**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్ రూ.3 కోట్ల లోపు రిటైల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను సవరించినట్లు ప్రకటించింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లు జూన్ 14, 2024 నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు బ్యాంక్ వెబ్‌సైట్లో పేర్కొంది. ఈ క్రమంలో సీనియర్ సిటిజన్లకు అదిరే శుభవార్త చెప్పింది. సాధారణ వడ్డీ రేటు కంటే అదనపు వడ్డీ కల్పిస్తున్నట్లు తెలిపింది. జనరల్ కస్టమర్లకు గరిష్ఠంగా 7.20 శాతం వడ్డీ ఇస్తుండగా.. సీనియర్ సిటిజన్లకు అదనంగా 55 బేసిస్ పాయింట్లతో 7.75 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. మరి గరిష్ఠ వడ్డీ రేటుపై రూ.1 లక్ష డిపాజిట్ చేస్తే మెచ్యూరిటీ తర్వాత ఎంతొస్తుంది? ఐసీఐసీఐ బ్యాంక్ లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం. ప్రస్తుతం 15 నెలల నుంచి రెండు సంవత్సరాలలోపు టెన్యూర్ గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై జనరల్ కస్టమర్లకు 7.20 శాతం వడ్డీ ఇస్తోంది. అలాగే సీనియర్ సిటిజన్లకు ఇప్పటి వరకు 50 బేసిస్ పాయింట్లు అదనపు వడ్డీ ఇస్తుండగా.. ఇకపై మరో 5 బేసిస్ పాయింట్లు ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తోంది. అంటే మొత్తంగా 7.75 శాతం మేర వడ్డీ అందిస్తోంది. దీని ప్రకారం ఈ 2 ఏళ్ల కాలానికి రూ.1 లక్ష జమ చేసినట్లయితే మెచ్యూరిటీ తర్వాత జనరల్ కస్టమర్లకు వడ్డీ రూ.14,138 వరకు వస్తుంది. అదే సీనియర్ సిటిజన్లకు అయితే 7.75 శాతం వడ్డీ రేటుతో రూ.15,209 వరకు అందుతాయి.

# అమూల్ బాటలో పరాగ్

- పెరిగిన పరాగ్ లీటర్ పాల ధర
- లీటరుకు రూ.2 పెరుగుదల
- టోన్డ్ మిల్క్ రూ.54 నుంచి రూ.56
- పరాగ్ గోల్డ్ రూ.66 నుంచి రూ.68కి పెంపు
- ప్రకటించిన పరాగ్ డెయిరీ జీఎం వికాస్ బలియన్

**విశ్వంభర, బిజినెస్:** ద్రవ్యోల్బణం ప్రభావం ఇప్పుడు ఆహార పదార్థాలపై ఎక్కువగా కనిపిస్తోంది. పప్పులు, ఉప్పు అనే తేడా లేకుండా అన్ని రకాల వస్తువుల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఇప్పటికే అమూల్ కంపెనీ పాల ధరలు పెంచగా అదే బాటలో పరాగ్ మిల్క్ కూడా పయనిస్తోంది. తాజాగా పరాగ్ పాల ధరలను పెంచింది. దీంతో ఇక నుంచి ఒక లీటరు పరాగ్ పాలకు రూ.2 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ కంపెనీ కి చెందిన రెండు రకాల ప్యాక్‌ల ధరల్లో పెంపుదల చేసింది. దీంతో ఇక నుంచి మార్కెట్లలో పరాగ్ టోన్డ్ మిల్క్ రూ.54కి బదులు రూ.56లకు లభ్యం కానుంది. పరాగ్ గోల్డ్ ఒక లీటర్ ధర రూ.66 నుంచి రూ.68కి పెరిగింది.

**లీటరుకు రెండు రూపాయలు పెంపు**

పరాగ్ మార్కెట్‌లో లభ్యమయ్యే 1 లీటర్ పాల ప్యాక్‌ల ధరలను పెంచినట్లు పరాగ్ డెయిరీ జీఎం వికాస్ బలియన్ తెలిపారు. దీంతో పాటు అరలీటర్ ప్యాకెట్లపై కూడా ఒక రూపాయి పెంచారు. పరాగ్ గోల్డ్ హాఫ్ లీటర్ ధర రూ.33 నుంచి రూ.34కి పెరిగింది. అంతేకాదు హాఫ్ లీటర్ పరాగ్ స్టాండర్డ్ ధర ఇప్పుడు రూ.30కి బదులుగా రూ.31గా ఉంది. అలాగే అరలీటర్ టోన్డ్ మిల్క్ ధర రూ.27కి బదులుగా ఇక నుంచి రూ.28లకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

**33 వేల లీటర్ల పాలు వినియోగం**

జూన్ 2న అమూల్ సహా ఇతర పాల ఉత్పత్తి కంపెనీలు ధరలు పెంచినట్లు పరాగ్ డెయిరీ జనరల్ మేనేజర్ తెలిపారు. వేడి కారణంగా పాల ఉత్పత్తి కూడా తగ్గుతోంది. పరాగ్ కంపెనీ నుంచి ప్రతి రోజూ దాదాపు 33 వేల లీటర్ల పాలు సరఫరా అవుతోంది. రైతులు కూడా పాల పెంచడంతో.. తమ కంపెనీ కూడా పాల ధరను పెంచాల్సి వచ్చిందని వెల్లడించింది.






# అదిరిపోయిన కన్నప్ప టీజర్.. ప్రభాస్ గెటప్ ఇదే..!



**విశ్వంభర, సినిమా:** మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప. కొన్ని రోజులుగా ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ నటీనటులు కీలకపాత్రలు పోషిస్తుండగా.. అత్యధిక బడ్జెట్ తో మోహన్ బాబు నిర్మిస్తున్నారు. న్యూజిలాండ్ అడవులతోపాటు.. రామోజీ ఫిలిం సిటీలో సెట్స్ వేసి కొన్నాళ్లుగా ఈ మూవీ షూటింగ్ చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయి. దాదాపు 150 కోట్ల బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ మూవీలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, నయనతార, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, అక్షయ్ కుమార్ వంటి స్టార్స్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా తాజాగా కన్నప్ప టీజర్ రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. ఈ టీజర్ మొత్తంలో కేవలం ప్రభాస్ కనిపించిన షాట్ మాత్రమే వైరల్ చేస్తున్నారు ఫ్యాన్స్. టీజర్ మొత్తంలో కొన్ని షాట్స్ చూస్తుంటే ఈసారి సినీ ప్రియులకు విజువల్ ట్రీట్ మాత్రం పక్కా అనిపిస్తుంది. ఇందులో ప్రభాస్ శివుడిగా కనిపించనున్నట్లు గతంలో వార్తలు వినిపించాయి. కానీ తాజాగా విడుదలైన టీజర్ లో మాత్రం అక్షయ్ కుమార్ శివుడిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రభాస్ కళ్లను చూపిస్తూ ఓ షాట్ వేసారు. అలాగే కన్నప్ప వీరుడిగా కనిపించనున్నాడు. యుద్ధ సన్నివేశాలు, గ్రాండ్ విజువల్ తో టీజర్ అదిరిపోయింది. దీంతో ఫుల్ టీజర్ యూట్యూబ్ లో రిలీజ్ చేయాలని కోరుతున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం సోషల్ మీడియాలో కన్నప్ప టీజర్ వైరలవుతుంది. ఇక ఇందులో డార్లింగ్ ఐ షాట్ చూసిన ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంబరపడిపోతున్నారు. ఇదిలా ఉంటే.. ఈ నెల తర్వాత వచ్చే నెల నుంచి ప్రతీ సోమవారం ఈ సినిమా నుంచి ఓ అప్డేట్ వస్తుందని.. ఇకపై కన్నప్ప సోమవారం అవుతుందని మంచు విష్ణు అన్నారు.

# రవితేజ మెడకు ఏమైంది..? హరీష్ శంకర్ పోస్ట్ వైరల్..!

**విశ్వంభర, సినిమా:** మాస్ మహారాజ రవితేజ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ సినిమా చేస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో హరీష్ శంకర్ దర్శకత్వంలో రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ప్రస్తుతం రవితేజ షూటింగ్ లో ఉన్నాడు. అయితే తాజాగా హరీష్ శంకర్ చేసిన పోస్ట్ వైరల్ గా మారింది. హరీష్ శంకర్ తాజాగా ఓ ఆసక్తికర ఫోటో షేర్ చేసాడు. ఈ ఫొటోలో.. రవితేజ మెడ నొప్పి తగ్గడానికి మెడ మీద బ్యాండ్ పెట్టుకొని కూర్చోగా హరీష్ శంకర్ పక్కనే అది పట్టుకొని కూర్చున్నాడు. ఈ ఫోటో షేర్ చేస్తూ.. మాస్ మహారాజ రవితేజ డెడికేషన్ కి హ్యాట్స్ ఆఫ్. తీవ్రమైన మెడ నొప్పితో బాధపడుతున్నా షూటింగ్ చేస్తున్నారు.



థ్యాంక్యూ అన్నయ్య. ప్రతి రోజు మమ్మల్ని ఇన్స్పైర్ చేస్తావు అని పోస్ట్ చేసాడు. దీంతో హరీష్ శంకర్ పోస్ట్ వైరల్ గా మారింది. రవితేజ మెడకు ఏమైంది? రవితేజ మెడ నొప్పికి కారణమేంటి అంటూ కొంతమంది అభిమానులు అడుగుతుండగా మరి కొంతమంది తీవ్రమైన నొప్పి ఉన్నప్పుడు రెస్ట్ తీసుకోవచ్చు కదా అంటుంటే, ఇంకొందరు రవితేజ డెడికేషన్ కి హ్యాట్స్ ఆఫ్ అంటున్నారు. సినిమా కోసం రవితేజ ఎంతగా కష్టపడతారో అందరికి తెలిసిందే.

# విశ్వంభరలో బాలీవుడ్ హీరో

**విశ్వంభర, సినిమా:** వశిష్ఠ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న మూవీ 'విశ్వంభర'. ఈ చిత్రంలో ఓ పవర్ఫుల్ పాత్రలో బాలీవుడ్ నటుడు కనిపించనున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు. బాలీవుడ్ స్టార్ కునాల్ కపూర్ 'విశ్వంభర' టీమ్‌లో జాయిన్ అయినట్లు తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. ఇందులో కునాల్ విలన్‌గా కనిపించనున్నారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.




ప్రస్తుతం 'విశ్వంభర' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో కునాల్ కూడా పాల్గొంటున్నారు ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్‌పై చిత్రబృందం ప్రత్యేక దృష్టి పెట్టనుంది. రూ.200కోట్లతో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా 'విశ్వంభర' రూపొందుతోంది. ఈ సినిమాలో ఐదుగురు హీరోయిన్లు ఉండనున్నట్లు ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో స్టార్ హీరోయిన్స్ త్రిష, ఆషికా అధికారికంగా జాయిన్ అయ్యారు. వీరితో పాటు సురభి, ఇషా చావ్లా, మీనాక్షి చౌదరి పేర్లను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.

# రచయితగా మారిన సంగీత దర్శకుడు శ్రీ వసంత్

**విశ్వంభర, సినిమా:** అల్లరి నరేష్ సుడిగాడు సినిమాతో సంగీత దర్శకుడిగా పరిచయమైన శ్రీ వసంత్ పలు సూపర్ హిట్ సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా వర్క్ చేశారు. వైవిధ్యమైన పాత్రలతో అలరిస్తున్న విలక్షణ నటుడు విజయ్ సేతుపతి హీరోగా నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుదర్శన్ సుందరం, జగదీష్ ఫళనిస్వామి నిర్మాతలుగా జూన్ 14న విడుదలైన చిత్రం మహారాజ. ఈ సినిమాకు శ్రీ వసంత్ పాటలు, మాటలు రాశారు. మహారాజ సినిమాలోని "అమ్మ నీకే నాన్నయ్యనా" అంటూ సాగే పాటలు శ్రీ వసంత్ స్వరాలు పాపులర్ అయ్యాయి, అజనీస్ లోకనాథ్ సంగీతం పాటకు మరో బిగ్ అసెట్. మహారాజ సినిమాకు విడుదలైన అన్ని చోట్ల మంచి రెస్పాన్స్ లభిస్తోంది, అలాగే మహారాజ రివ్యూస్ లో మాటలు, పాటల గురించి కూడా పాజిటీవ్ గా ప్రస్తావించారు. విజయ్ సేతుపతి నటించిన 50వ సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మహారాజ ఆసక్తికరమైన క్రైమ్ థ్రిల్లర్ గా ప్రేక్షకులను అలరిస్తోంది. ఒక మంచి సినిమాకు మాటలు, పాటలు రాయడం సంతోషాన్ని కలిగిస్తుందని శ్రీ వసంత్ తెలిపారు. శ్రీ వసంత్ స్వీయ డబ్బింగ్ కంపెనీ "పోస్ట్ ప్రో మీడియా వర్క్స్" లో మహారాజ సినిమా డబ్ అవ్వడం జరిగింది. అలాగే మంచి విజయం సాధించిన కార్తికేయ 2 కూడా పోస్ట్ ప్రో మీడియా వర్క్స్ లో డబ్ అవ్వడం విశేషం.



# తాప్సీ.. నీకు ఇంత యాటిట్యూడ్ ఎందుకు?

**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్ ఇండస్ట్రీలో ఒకప్పుడు వరుస సినిమాలతో మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్న హీరోయిన్ తాప్సీ పన్నూ. ఝుమ్మంది నాదం సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైన ఈ భామ.. అతి తక్కువ టైంలోనే స్టార్ డమ్ అందుకుంది. రవితేజ, ప్రభాస్ వంటి స్టార్ హీరోల సరసన నటించి మెప్పించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు బాలీవుడ్ లో సెటిల్ అయ్యింది. కొన్నాళ్లుగా హిందీలో సినిమాలు చేస్తూ అక్కడే ఉండిపోయింది. చివరగా షారుఖ్ ఖాన్ నటించిన డుంకీ చిత్రంలో కనిపించిన తాప్సీ.. ఇటీవలే తన ప్రియుడు మథియాస్ బో ని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత తాప్సీ మూవీ, అవార్డ్స్ ఈవెంట్లలో పాల్గొంటూ సందడి చేస్తుంది. అయితే ఇప్పుడు తాప్సీ తీరుపై నెటిజన్స్ మండిపడుతున్నారు. ఎందుకు నీకు అంత యాటిట్యూడ్ అంటూ ఓ రేంజ్‌లో తిట్టిపోస్తున్నారు. అసలు ఏం జరిగిందంటే.. బాలీవుడ్ సెలబ్రెటీలు ఎక్కడికి వెళ్లినా ఫోటోగ్రాఫర్స్ కంట పడాల్సిందే. జిమ్, రెస్టారెంట్స్ ఇలా ఎక్కడ కనిపించినా వెంటనే కెమెరాల్లో బంధించేస్తారు. ఇక కొందరు తారలు ఫోటోలకు ఫోజులిస్తే మరికొందరు మాత్రం వారిని లెక్కచేయకుండా వెళ్లిపోతారు. ఇటీవల జాన్వీ కపూర్ ఫోటోగ్రాఫర్స్ ముందు ఇబ్బందిగా ఫీల్ అయినా అభిమానులకు సెల్ఫీలు ఇచ్చింది. కానీ తాప్సీ మాత్రం తనను ఫోటోస్ తీసేందుకు ట్రై చేస్తున్న కెమెరామెన్లను ఏమాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోయింది. ఫోటోగ్రాఫర్స్ ప్లీజ్ అంటూ వెంటపడినా లెక్కచేయకుండా కారు ఎక్కేసింది. ఒక్క సెల్ఫీ మేడమ్ అంటూ ఓ అభిమాని ఎదురుపడినా అడిగినా.. పక్కకు జరుగు అంటూ అతడి వైపు కన్నెత్తి చూడకుండా వెళ్లిపోయింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతుండగా.. తాప్సీ తీరుపై నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు. నీకు ఎందుకంత యాటిట్యూడ్.. ? జయా బచ్చన్ ను చూసి నేర్చుకుంటున్నావా..? నీకు అంత సీన్ లేదు.. నీ సినిమాలన్నీ షెడ్డుకు వెళ్లిపోతున్నాయన్న ఫ్రస్టేషన్ లో ఉన్నావా..? అంటూ మండిపడుతున్నారు.




# 'రాబిన్ హుడ్' మూవీలో శ్రీలీల గ్లింప్స్ అదుర్స్

**విశ్వంభర, సినిమా:** టాలీవుడ్ మోస్ట్ హాప్పెనింగ్ హీరోయిన్‌గా మొన్నటి వరకు చేతినిండా సినిమాలతో దూసుకెళ్లిన శ్రీలీల.. ఇప్పుడు కాస్త స్లో అయిపోయింది. వరుస ఫ్లాఫ్‌లతో ఈ భామ తన కెరీర్ గాడిని స్లో చేసింది. కానీ అవకాశాలకు మాత్రం ఈ బ్యూటీకి కొదువలేదు. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో ఉస్తాద్ భగత్ సింగ్, రవితేజ 75వ సినిమాలు మాత్రమే ఉన్నాయి. అయితే ఇప్పుడు శ్రీలీల మరో మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఈ భామ నితిన్ హీరోగా నటిస్తున్న రాబిన్‌హుడ్ మూవీకి పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించిన గ్లింప్స్‌తో అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కూడా వచ్చింది. శుక్రవారం శ్రీలీల పుట్టినరోజు సందర్భంగా రాబిన్ హుడ్ టీమ్ స్పెషల్ బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఓ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో శ్రీలీల అల్ట్రా స్టైలిష్ లుక్‌లో ఫుల్ రిచ్ అండ్ గ్లామర్‌గా కనిపిస్తూ బాస్ లేడీ వైబ్స్ ఇచ్చింది. ఓ ఫ్లైట్ నుంచి దిగి నడుస్తూ 'సునామీలో టీ సైలెంట్ ఉండాలి, నా ముందు నువ్వు సైలెంట్ ఉండాలి' అంటూ వెన్నెల కిశోర్‌తో చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది.

# గర్భిణీలు ఈ విషయాలను తప్పక గుర్తుంచుకోవాలి!

**విశ్వంభర, ఫీచర్ :**

గర్భం దాల్చిన మొదటి త్రైమాసికంలో స్త్రీలలో గర్భస్రావం అయ్యే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకోవడం ద్వారా ఈ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. గర్భస్రావం జరగకుండా ఉండాలంటే మహిళలు ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని వైద్యులు చెబుతున్నారు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ఫోలిక్ యాసిడ్, ఐరన్, కాల్షియం, ఇతర అవసరమైన పోషకాలను తగినంతగా తీసుకోవడం శిశువు పెరుగుదలకు సహాయపడుతుంది. ఇది కాకుండా గుర్తుంచుకోవలసిన అనేక విషయాలు ఉన్నాయి.

**సురక్షితంగా వ్యాయామం చేయండి:**

గర్భధారణ సమయంలో రెగ్యులర్, మితమైన వ్యాయామం ప్రయోజనకరంగా ఉంటుంది. లోతైన శ్వాస వ్యాయామాలు, రోజువారీ నడకలు ప్రయోజనకరంగా ఉంటాయి. అయితే మహిళలు శారీరక శ్రమను నిపుణుల సలహా మేరకు మాత్రమే చేయాలి.

**మానసిక ఒత్తిడిని తగ్గించుకోండి:**

అధిక ఒత్తిడి గర్భధారణపై తీవ్రమైన ప్రభావాలను కలిగిస్తుంది. యోగా, ధ్యానం లేదా లోతైన శ్వాస వ్యాయామాలు వంటి ఒత్తిడిని తగ్గించే పద్ధతులను ప్రాక్టీస్ చేయండి. కుటుంబం, స్నేహితులు, వృత్తిపరమైన కౌన్సెలింగ్ నుండి మద్దతు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. మీరు గర్భధారణ సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి లేదా మరేదైనా తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటుంటే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు.



## హానికరమైన పదార్థాలను నివారించండి

ధూమపానం, ఆల్కహాల్, మితిమీరిన కెఫిన్ వినియోగం మానుకోండని ఫరీదాబాద్‌లోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హాస్పిటల్ గైనకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ నీతి కౌతీష్ చెప్పారు. ఎందుకంటే ఇవి గర్భస్రావం ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతాయి. మీకు డయాబెటిస్, అధిక రక్తపోటు, థైరాయిడ్ వ్యాధి వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే, వాటిని అదుపులో ఉంచండి. డాక్టర్ సూచించిన సాధారణ తనిఖీలు, చికిత్సను అనుసరించండి. దీంతో గర్భస్రావాన్ని నివారించవచ్చు.



# వర్షా కాలంలో తలలో చుండ్రు నివారణకు ఎఫెక్టివ్ న్యాచురల్ రెమెడీస్

**విశ్వంభర, ఫీచర్ :** వేడి, తేమతో కూడిన పరిస్థితులు వర్షాకాలం లక్షణం. కాబట్టి, ఈజుట్టు సమస్య అనేది పిల్లల నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేసే సాధారణ సమస్య. నేటి యువత తరచుగా జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి సీజన్లో మన చర్మం మరియు జుట్టుకు సమస్యలు వస్తాయి. అలాగే, రుతుపవనాలు స్కాల్ప్ ఇన్ఫెక్షన్లు మరియు జుట్టు సమస్యలను కలిగిస్తాయి. వర్షాకాలంలో, మీరు జిడ్డుగల జుట్టు, జిడ్డుగల జుట్టు మరియు తీవ్రమైన చుండ్రు మరియు దురదను అనుభవించవచ్చు. ఇది మీ జుట్టు మూలాలను బలహీనపరుస్తుంది మరియు మరింత జుట్టు రాలడానికి కారణమవుతుంది. ఈ పరిస్థితికి వెంటనే చికిత్స చేయకపోతే, ఇది తీవ్రమైన జుట్టు రాలడానికి దారితీస్తుంది. సీజన్‌లో మీ జుట్టు రాలడం



150 శాతం ఎక్కువ. సగటున, మహిళలు రోజుకు 50 వెంట్రుకలు కోల్పోతారు. అయితే వర్షాకాలంలో 150200 వెంట్రుకలు రాలిపోతాయి. వర్షాకాలంలో మీ జుట్టును ఆరోగ్యంగా మరియు అందంగా ఉంచడంలో సహాయపడే కొన్ని సాధారణ హెయిర్ మాస్క్‌లు ఇక్కడ ఉన్నాయి.

**మెంతులు**

మెంతి గింజల్లో యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి. మెంతి గింజలను రాత్రంతా నానబెట్టి పేస్ట్‌లా రుబ్బుకోవాలి. ఈ పేస్ట్‌ను మీ తలకు పట్టించి 30 నిమిషాల పాటు అలాగే ఉంచండి. నీటితో శుభ్రం చేయు. ఈ రెమెడీ చుండ్రును సమర్థవంతంగా తగ్గించడంలో సహాయపడుతుంది.

**కలబంద**

కలబంద దాని ఓదార్పు లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇది స్కాల్ప్ ఇరిటేషన్ మరియు చుండ్రుని తగ్గించడంలో సహాయపడుతుంది. తాజా కలబంద జెల్‌ను నేరుగా మీ తలకు అప్లై చేయండి. కడిగే ముందు అరగంట పాటు అలాగే ఉంచండి. రెగ్యులర్ అప్లికేషన్ మీ స్కాల్ప్ ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**నిమ్మరసం ఉపయోగించండి**

నిమ్మరసం దాని శుభ్రపరిచే లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇది చుండ్రును పోగొట్టి స్కాల్ప్‌ను తాజాగా ఉంచుతుంది. నిమ్మరసాన్ని నేరుగా తలకు పట్టించండి. నీటితో కడిగే ముందు సుమారు 10 నిమిషాలు వదిలివేయండి. రెగ్యులర్ ఉపయోగం చుండ్రుని తగ్గించడంలో సహాయపడుతుంది.

**కొబ్బరి నూనె మరియు కర్పూరం**

కొబ్బరి నూనె సహజ మాయిశ్చరైజర్. కర్పూరంతో మిక్స్ చేయడం వల్ల చుండ్రు నిరోధక గుణాలు పెరుగుతాయి. ఈ మిశ్రమాన్ని మీ తలకు పట్టించి రాత్రంతా అలాగే వదిలేయండి. ఉదయం దానిని కడగాలి. ఇది చుండ్రును నియంత్రించడంలో మరియు మీ శిరోజాలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com